ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
గురువారం 19 సెప్టెంబరు 2024

చక్రాలమడుగులో భారీ ఎత్తున వెలసిన పెద్ద పెద్ద భవంతులు







ఏరు.. ఊరైంది..!

రాజంపేట పట్టణంలో చక్రాలమడుగు మరో బుడమేరుగా మారే ప్రమాదం ఉందని ఇక్కడి ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సాధారణంగా ఎక్కడైన ఏటి పక్కన ఆక్రమించి నిర్మాణాలు చేస్తుంటారు. కానీ చక్రాలమడుగులో మాత్రం నది ఏటిలోనే పెద్ద పెద్ద భవంతులు నిర్మించారు. ఇదేమని ప్రశ్నించిన వారితో మేము ఆక్రమించి కట్టుకోలేదు.. మాకు ఆ స్థలానికి రిజిస్ట్రేషన్ ఉందని చెబుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఓ మోస్తరు వర్షం కురిసిందంటే చక్రాలమడుగులో నీరు పారకుండా రాజంపేటలోకి వస్తోంది. ఇక విజయవాడలో కురిసినట్లు అతి భారీ వర్షం కురిసిందంటే రాజంపేట మరో బుడమేరుగా మారే ప్రమాదం ఉంది. చక్రాలమడుగు నది పట్టణానికి ఆనుకుని హైవే పక్కనే ప్రవహిస్తోంది. రాను రాను ఈ నది ఆక్రమణలమయం కావడంతో ఏరు అంతా అక్రమ కట్టడాల మయమైంది. భువనగిరిపల్లె సమీపం నుంచి రిలయన్స్ పెట్రోల్ బంకు వరకు సుమారు 2 కిలోమీటర్ల మేర నదిని పూర్తిగా ఆక్రమించేసి పెద్ద పెద్ద భవంతులు నిర్మించారు. నదిలో నిర్మాణాలు చేపట్టిన ఎవరిని అడిగినా ఇది మాకు పక్కా రిజిస్ట్రేషన్ అని చెబుతున్నారు. మాది పాత పట్టా అని, గతంలో ఈ ఏరు చిన్న కాలువలా ప్రవహించేదని, రాను రాను వరదల వల్ల ఈ కాలువ వెడల్పు కావడంతో మా రిజిస్ట్రేషన్ భూమిలో ఈ ఏరు వెళుతోందని అంటున్నారు.

- మరో బుడమేరుగా చక్రాలమడుగు
- ఎక్కడ చూసినా కబ్జాలే
- నడి ఏట్లోనే భారీ ఎత్తున వ్యాపార సముదాయాలు
- మాకు రిజిస్ట్రేషన్ ఉందంటున్న భవనాల యజమానులు
- వర్షాకాలంలో పట్టణంలోకి చేరుతున్న వరద నీరు
- ముందస్తు చర్యలు తీసుకోకపోతే పొంచి ఉన్న పెనుముప్పు

రాజంపేట, సెప్టెంబరు 18 : తరతరాల నుంచి రాజంపేట నడిబొడ్డున ఈ చక్రాలమడుగు ఉంది. గతంలో ఎప్పుడు భారీ వర్షాలు వచ్చినా నదికి భారీగా వరద నీరు చేరినా పట్టణానికి ఇబ్బంది ఉండేది కాదు. నదిలో రామ్‌నగర్ వద్ద ఓవర్‌బ్రిడ్జిని నిర్మించడంతో వర్షాకాలంలో కూడా ఇబ్బంది లేకుండా ఉండేది. పట్టణానికి ఆనుకుని చక్రాలమడుగు పక్కనే జాతీయ రహదారి కూడా ఏర్పాటు కావడంతో వర్షాల్లో వరద ముప్పు తప్పింది. అయితే 15 ఏళ్లుగా భువనగిరిపల్లె సమీపం నుంచి నదిలో భారీ భవంతులు నిర్మించేశారు. నదికి అడ్డంగా ఈ నిర్మాణాలు వెలిశాయి. ఒక్కసారిగా నట్టి నడియేటిలో 3 అంతస్థుల భవనాలు వందలాదిగా వెలిశాయి. ప్రతి ఒక్కరూ భవన నిర్మాణదారులు ఈ నదిలో కట్టుకున్న ఇళ్లు తమ రిజిస్ట్రేషన్‌లోనే ఉన్నాయని, తాము నదిని ఆక్రమించలేదని అంటున్నారు. నదిలో అనేక వ్యాపార సముదాయాలు, కల్యాణమండపాలు నిర్మించేశారు. దీనివల్ల వర్షాకాలంలో వరద నీరు ఏటిగుండా కాకుండా పట్టణంలో రోడ్లపై ప్రవహిస్తోంది. ఏటికి అడ్డంగా భవనాలు నిర్మించడంతో వరదనీరు ఎటూ పోలేక పక్కనే ఉన్న రోడ్డుపై ఈ భారీ వరదనీరు చేరి భువనగిరిపల్లె వై-జంక్షన్ మీదుగా సబ్‌స్టేషన్ నుంచి పాతబస్టాండ్ మీదుగా ఈ వరదనీరు వచ్చి చేరుతోంది. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయినప్పుడు మొత్తం వరద నీరు అంతా చక్రాలమడుగు నీరు నదిలో పోలేక పట్టణం గుండా ప్రవహించింది. ఎగువ ప్రాంతంలో పుల్లంగేరు ప్రవహిస్తోంది. ఈ పుల్లంగేరు ఊటుకూరు మీదుగా రాజంపేట పోలి చెరువుకు కొంతనీరు, చక్రాలమడుగుకు కొంత నీరు వస్తుంది. పోలిచెరువు నిండితే మొత్తం పుల్లంగేరు నీరు అంతా చక్రాలమడుగు ద్వారానే ప్రవహిస్తోంది. అయితే ఏరు అంతా ఊరు కావడంతో ఆ భారీ వరద నీరు అంతా పట్టణంపై పడుతోంది. దీనివల్ల వర్షాకాలంలో భువనగిరిపల్లె ఆర్చి నుంచి పుల్లంపేట రోడ్డు, పాతబస్టాండు, ఎన్టీఆర్ సర్కిల్, ఈడిగపాళెం, ఉస్మాన్ నగర్, మొత్తం మునిగిపోయే పరిస్థితి ఏర్పడింది.

గతంలో చాలామార్లు ఇదేవిధంగా జరగడంతో పట్టణ ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ చక్రాలమడుగును సుందరీకరణ చేస్తామని దీనికోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తామని, ఆక్రమణలు తొలగించి ట్యాంక్‌బండ్ రీతిలో అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. నాటి రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు కూడా దీనిపై స్పష్టమైన ప్రకటనలు చేశారు. వర్షాకాలంలో చక్రాలమడుగు నీరు పట్టణంలోకి చేరకుండా ప్రత్యేక ప్రణాళికతో ఆక్రమణలు తొలగించి చర్యలు చేపడతామని తెలిపారు. మంత్రితో పాటు నాటి ఉమ్మడి జిల్లా పరిపాలన యంత్రాంగం కూడా చక్రాలమడుగు ఆక్రమణలపై స్పష్టమైన ప్రకటన చేసింది. అయితే ఇంతవరకు నాటి పాలకుల మాటలు ఒక్కటి కూడా అమలు కాలేదు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, వారి ప్రాణాల దృష్ట్యా ప్రతి ఏడాది భారీ వర్షాలతో వరద నీరు పట్టణంలోకి ప్రవేశించకుండా, ప్రాణ నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఒకవేళ నిజంగా చక్రాలమడుగులో కట్టుకున్న భవనాలకు వారి స్థలాలు వారి పూర్వీకులవి అయి రిజిస్ట్రేషన్ భూములు అయితే ప్రజల ప్రాణాలను రక్షించే నిమిత్తం వారికి నష్టపరిహారం చెల్లించి అక్రమ కట్టడాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రజల ప్రాణాలను రక్షించే నిమిత్తం చక్రాలమడుగులో సొంత రిజిస్ట్రేషన్ స్థలాలు ఉన్నప్పటికీ దీనిపై ఒక చట్టాన్ని తీసుకు వచ్చి వారికి నష్టపరిహారం అందజేసి నదిలో భవన నిర్మాణాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ఆ విధంగా కాకుండా నదిలో భవనాలు నిర్మిస్తుంటే వాటిపై చర్యలు తీసుకోకుండా ఉంటే వర్షాకాలంలో జరిగే ప్రాణనష్టానికి ఎవరు బాధ్యులు అవుతారో అధికారులే చెప్పాలి. నూతన ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని రాజంపేట ప్రజలు కోరుతున్నారు.



కొత్తగా నిర్మాణాల కోసం చక్రాలమడుగులో ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్న దృశ్యం



2021 నవంబరులో వచ్చిన వరదలకు చక్రాలమడుగు పొంగి రాజంపేటను ముంచెత్తిన వరదనీరు (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో.. ఇద్దరు పాలిటెక్నిక్ విద్యార్థుల మృతి

- అపస్మారక స్థితిలో మరొకరు

కుప్పం, సెప్టెంబరు 18: కుప్పం జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుప్పం జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఇద్దరు మృతి చెందారు. అధ్యాపకులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లెకు చెందిన పునీత్‌కుమార్ (18), ఆనంద్‌బాబు (15), రాజంపేటకు చెందిన చెందిన మంజునాథరెడ్డి (18)లు కుప్పంలో గది తీసుకుని ఉంటూ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఎలక్ట్రికల్స్, ఈసీఈ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. వీరిలో ఆనంద్‌బాబుకు చెవినొప్పి ఉండడంతో వైద్యంకోసం ద్విచక్ర వాహనంపై పీఈఎస్ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ వైద్యం చేయించుకుని గదికి తిరుగు ప్రయాణమయ్యారు. కుప్పం పట్టణ సమీపం చెరువు బైపాస్ క్రాస్ వద్దకు వచ్చేసరికి ఓ ట్రాక్టరు రోడ్డు దాటడం కనిపించింది. అయితే అమిత వేగంతో వస్తున్న యువకులు.. ఈ ట్రాక్టర్ వెనుక భాగాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొని ఆగిపోయింది. ద్విచక్ర వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రోడ్డు మీద పడిన మంజునాథరెడ్డి, ఆనంద్‌బాబు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. పునీత్ కుమార్ అపస్మారక స్థితిలో పీఈఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుప్పం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





మృతి చెందిన మంజునాథరెడ్డి, ఆనంద్‌బాబు

ఢిల్లీకి కాబోయే సీఎం రిషివ్యాలీ టీచర్!

- రిషివ్యాలీలో ఏడాది పాటు బోధనలు
- త్వరలో ఢిల్లీ పీఠం అధిష్ఠించనున్న ఆతిశీ...

మదనపల్లె టౌన్/ కురబలకోట, సెప్టెంబరు 18: ఆతిశీ... (ఆతిశీ మర్లేనా సింగ్) ఈ పేరు నిన్నటి వరకు ఢిల్లీ ప్రాంత ప్రజలకే తెలుసు. కానీ నేడు దేశవ్యాప్తంగా ఈ పేరు అన్ని రాష్ట్రాల్లో వినిపిస్తోంది. 43 ఏళ్ల ప్రాయంలోనే ఢిల్లీకి కాబోయే సీఎంగా, రాజకీయ మహిళా దురంధరులుగా నిలిచిన షీలాదీక్షిత్, సుష్మాస్వరాజ్ సరసన నిలవనున్నారు. అలాంటి ఆతిశీ అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలో ప్రముఖ తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి స్థాపించిన రిషివ్యాలీ స్కూల్లో ఏడాది పాటు ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ సింగ్, త్రిప్తా దంపతుల కుమార్తె ఆతిశీ ప్రాథమిక విద్య ఢిల్లీలోని స్ప్రింగ్‌డేల్స్ స్కూల్‌లో, స్టీఫెన్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిన ఆతిశీ 2003 సంవత్సరంలో స్వదేశానికి తిరిగొచ్చారు. బోధనల పట్ల ఆసక్తి చూపిస్తున్న ఆమె మనసులో ఆలోచనలను గ్రహించిన తండ్రి విజయ్‌కుమార్ గుప్తా దేశంలోనే ప్రసిద్ధి చెందిన రిషివ్యాలీ స్కూల్‌లో ఆతిశీని ఉపాధ్యాయురాలిగా చేర్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా రిషివ్యాలీ విద్యాసంస్థ ప్రతినిధులతో తనకున్న పరిచయాలతో ఆతిశీని రిషివ్యాలీలో ఉపాధ్యాయురాలిగా చేర్పించగలిగారు. ఈ క్రమంలో 2003 నుంచి 2004 సంవత్సరం వరకు నాలుగో తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఆతిశీ ఏడాది పాటు ఇంగ్లీషు, హిస్టరీ సబ్జెక్టులను బోధించారు. కాగా సేవా కార్యక్రమాల వైపు ఆకర్షితురాలైన ఆతిశీ రిషివ్యాలీ నుంచి మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో ఓ స్వచ్ఛంద సంస్థలో సేవలందించేందుకు వెళ్లారు. అలాంటి ఆతిశీ చిన్నవయస్సులోనే ఢిల్లీకి మూడో మహిళా సీఎం కాబోతున్నారని తెలియగానే కురబలకోట మండలంలోని రిషివ్యాలీ విద్యాసంస్థలో అందరికీ ఆసక్తి పెరిగింది. అంతేకాకుండా ఉమ్మడి చిత్తూరు జిల్లా, అన్నమయ్య జిల్లాల ప్రజలు సోషల్ మీడియాలో వస్తున్న ఆతిశీ వార్తలపై చర్చించుకోవడం వినిపించింది.

విద్య అంటే ఆతిశీకి ప్రాణం

విద్యాబోధనలు, కొత్త విషయాలను గ్రహించడం అంటే ఆతిశీకి ప్రాణమని ఆమెతో పాటు పనిచేసిన ఉపాధ్యాయులు అంటున్నారు. కేవలం ఏడాది పాటు ఆమెతో కలిసి పనిచేసిన సీనియర్లు ఆమె గురించి క్లుప్తంగా మాత్రమే తెలుసంటున్నారు. మహిళలు విద్యతోనే అన్ని రంగాల్లో ఎదుగుతారనేందుకు ఆతిశీనే ఒక ఉదాహరణ అంటున్నారు. అందుకే నేమో ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ క్యాబినెట్‌లో విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, సాంస్కృతిక, పర్యాటక, పబ్లిక్ వర్క్స్ శాఖ మంత్రిగా పనిచేశారంటే ఆతిశీకి విద్యానుబంధం ఎలాంటిదో అర్థమవుతుందంటున్నారు.





ఢిల్లీకి కాబోయే సీఎం ఆతిశీ విద్యాబోధనలు అందించిన రిషివ్యాలీ స్కూల్ పరిపాలన భవనం



మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాలులో బుధవారం సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన ఎన్డీయే శాసన సభాపక్ష నేతల సమావేశంలో పాల్గొన్న జిల్లాకు చెందిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, షాజహాన్‌బాషా, అరవ శ్రీధర్



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

వేగవంతంగా ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన

- ప్రజల అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలి
- కలెక్టర్ చామకూరి శ్రీధర్

వీరబల్లి, సెప్టెంబరు 18: వీరబల్లి మండలంలో నిబంధనలను పాటిస్తూ ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం వీరబల్లి మం డల రెవెన్యూ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ప్ర భుత్వం ఫ్రీహోల్డ్ భూముల పరిశీలనకు జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన వీరబల్లి మండలంలో జరుగుతున్న ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన కార్యక్రమంపై తహసీల్దార్, వీఆర్వోలతో సమావేశం నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఫ్రీహోల్డ్ అయిన భూముల సంఖ్య, ఇప్పటి వరకు పరిశీలన చేసిన భూములు, ఇందులో రిజిస్ట్రేషన్లు అయిన భూములు ఎన్ని, అవి చుక్కల భూములా, ఈనాం భూములా, ఫ్రీహోల్డ్ అయిన భూముల విస్తీర్ణం ఎంత, ఫ్రీహోల్డ్ తర్వాత అవి అమ్మారా, గిఫ్ట్ కింద ఇచ్చారా.. వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయాలని సూచించారు. మండలంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదులను వెంటనే పరి ష్కరించాలన్నారు. అలాగే ఇంటింటి ఓటర్ జాబి తా పరిశీలన ప్రగతిని కూడా కలెక్టర్ సమీక్షించి తగు సూచనలు, సలహాలు జారీ చేశారు. కార్యక్రమంలో వీరబల్లి తహసీల్దార్ శ్రావణి, ఎంపీడీవో రామచంద్రారెడ్డి, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హత లేదు.. నాడి పట్టేస్తున్నారు..

- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- రాత్రికి రాత్రే ఆస్పత్రుల బోర్డులు పెట్టేస్తున్నారు
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ



రాయచోటి (కలెక్టరేట్), సెప్టెంబరు 18: వైద్యాన్ని వ్యాపారంగా భావించిన కొందరు అక్రమ సంపాదన కోసం కనీసం ఆర్‌ఎంపీ అర్హత గుర్తింపుపత్రం లేకపోయినా రాత్రికి రాత్రే అందమైన బోర్డులు పెట్టి ఎక్కడో ఉన్న వైద్యుల పేర్లు వాడుకుని నాడి పట్టేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అందమైన బోర్డులు పెట్టి రండిబాబు..రండిబాబు అని రోగులను ఆకర్షిస్తూ శస్త్రచికిత్సలు సైతం చేస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. ఇలాంటి నకిలీ అసుపత్రులు జిల్లాలో దాదాపు 30 వరకు ఉన్నట్లు జిల్లా అధికారులు గుర్తించారు. జిల్లాలో మదనపల్లి, రాజంపేట డివిజన్‌లలో ఎక్కువగా ఉన్నట్లు అధికారుల దగ్గర పక్కాగా సమాచారం ఉంది. అయితే వాటిని నియంత్రించేందుకు వైద్యఆరోగ్యశాఖ సిద్ధంగా లేదనే వాదన వినిపిస్తోంది. గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా నకిలీ డాక్టర్లు వైద్యం చేసినా పట్టించుకునేవారు లేకపోవడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నచందంగా మారింది. కోట్లాది రూపాయలు పెట్టి అసుపత్రులు కడుతున్నారు కానీ దానికి అనుమతులు తీసుకోవడానికి వెనుకాడుతున్నారంటే నిజంగా డాక్టర్ (ఎంబీబీఎస్) పూర్తి చేసి ఉంటే ఎందుకు అనుమతులు తీసుకోరు అనే వాదన బలంగా ఉంది. ప్రైవేటు అసుపత్రుల పనితీరుపై ఆరా తీయాల్సిన అధికారులు అన్ని విషయాలు తెలిసినా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. రాయచోటితో పాటు ఇతర ప్రాంతాల్లో వీధికొక క్లీనిక్ పెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతుంటే అధికారులు ప్రేక్షకపాత్రలో ఉండడం వెనుక అంతర్యం ఏమిటో అధికారులే చెప్పాలి. పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు హంగామా చేస్తున్నారే తప్ప పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అసుపత్రులపై కనీస చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. ఆసుపత్రి పెట్టాలంటే ఎంబీబీఎస్ డాక్టర్ సర్టిఫికెట్ పొందడంతో పాటు అసుపత్రికి సంబంధించిన నిబంధనలు అన్నిటిని ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు పాటించకుండా, ఎంబీబీఎస్ సర్టిఫికెట్ లేకపోయినా ధనబలం, రాజకీయ బలంతో విచ్చలవిడిగా ఆసుపత్రులు వెలుస్తున్నాయని కొంతమంది రిటైర్ అయిన డాక్టర్లు చెబుతున్నారు. ఒక రకంగా చెప్పాలంటే జిల్లా మొత్తం ఠాగూర్ సినిమాలోని (శవానికి డాక్టర్లు హడావుడిగా చికిత్స చేసినట్లు నటించే సన్నివేశం) సన్నివేశాన్ని తలపిస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. జిల్లాలో దాదాపు 14 మంది అలు పెట్టినా జిల్లా అధికారులు చాలా లైట్‌గా తీసుకున్నారని తెలుస్తోంది. అంతేకాకుండా ప్రైవేట్ ఆసుపత్రులలో గర్భస్థ లింగ నిర్ధారణకు అధిక మొత్తంలో డబ్బులు తీసుకుని లింగ నిర్ధారణ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నాలుగు నెలల క్రితం అనుమతులు లేని అసుపత్రులకు జిల్లా అధికారులు నోటీసులు ఇచ్చారు. అయితే వారిలో కొంతమంది మాత్రమే అనుమతులు తీసుకున్నారని, మిగిలిన వారు కనీసం ఫోన్ ఎత్తడం లేదని, నోటీసులకు సమాధానం కూడా ఇవ్వడం లేదని అధికారులు చెప్పడం విశేషం. జిల్లాలో ఉన్న అనుమతులు లేని అసుపత్రులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి..

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న గుర్తింపు లేని అసుపత్రులపై విచారించి కఠిన చర్యలు తీసుకోవాలి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో జిల్లా అధికారులను పక్కన పెట్టి కింది స్థాయిలో ఉన్న వారే పెత్తనం చెలాయిస్తున్నారనే వాదన బలంగా ఉం ది. ఈ రెండు సంవత్సరాలలో ఒక్క అధికారిపై కూడా చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. కొంతమంది పీహెచ్‌సీలలో డాక్ట ర్లు విధులకు వెళ్లకుండా అక్కడ ఉన్న నర్సులతో విధులు నిర్వహిస్తూ కాలం గడుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని నకిలీ డాక్టర్లు, అనుమతులు లేని ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- పి.రెడ్డెయ్య, న్యాయవాది, రాయచోటి

ఆసుపత్రులకు నోటీసులు ఇచ్చాం..

ఇప్పటి వరకు జిల్లాలో కొన్ని అసుపత్రులకు నోటీసులు ఇచ్చాం. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులకు పదే పదే నోటీసులు ఇచ్చినా వారు అనుమతులు మాత్రం తీసుకోవడం లేదు. సర్టిఫికెట్ లేని వారికి అప్లై చేసుకోమని చెప్పాం. ఇంకా కొంతమంది ఆన్‌లైన్ ద్వారా అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

- కొండయ్య, డీఎంహెచ్‌వో

వాన జాడ లేక...

- ఎండుతున్న పంటలు
- కాపాడుకునేందుకు రైతన్నల తాపత్రయం
- బోరుబావుల తవ్వకాలు.. లక్షల్లో ఖర్చు
- రైతులకు తప్పని కష్టాలు

సంబేపల్లె, సెప్టెంబరు 18: వేసవిని తలపించేలా భగభగ మండుతున్న ఎండలు... అప్పడప్పుడు మేఘాలు కమ్ముకుంటున్నా వర్షం జాడ లేక.. రోజురోజుకు భూగర్భజలాలు పాతాళానికి పడిపోయాయి. దీంతో సాగు చేసిన పంటలన్నీ కళ్లముందు ఎండిపోవటంతో రైతన్నలు తల్లడిల్లిపోతున్నారు. పంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. కొందరు రైతులు ట్యాంకర్ల ద్వారా నీటి తడులు అందిస్తుంటే.. మరి కొందరు అప్పులు చేసి బోరు బావులను తవ్విస్తున్నారు. ఇదే అదునుగా బోరు బావుల తవ్వకానికి ధరలు భారీగా పెంచేశారు. గతంలో బోరుబావి తవ్వకాలకు 300 అడుగుల వరకు 80 నుంచి 85 రూపాయలు ఉండేది. ప్రస్తుతం 100 రూపాయలకు పెంచారు. దీంతో రైతులు బోరు బావి తవ్వాలంటే లక్షరూపాయలుపైనే ఖర్చు చేయాల్సి వస్తోంది. గత రెండు నెలల నుంచి వర్షం జాడ లేకపోవడంతో వరినార్లు పోసిన కొందరు రైతులు వదిలేశారు. వేరుశనగ పంట ఎండిపోతుంది. మామిడి చెట్లు నిలువునా మాడిపోతున్నాయి. పల్లె జనాలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా ఇదే పరిస్థితి. సాగు చేసిన పంటలన్నీ ఎండిపోయి కరువు నెలకొంది. కరువు పరిస్థితులు నుంచి తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.


వదిలేసిన వరినారులో పశువులు మేస్తున్న దృశ్యం


దుద్యాల పెద్దజంగంపల్లె వద్ద ఎండిపోయిన వేరుశనగ పంట


టమోటా పంటకు ట్యాంకర్ ద్వారా నీటి తడి అందిస్తున్న రైతు


కేతంరెడ్డిగారిపల్లె వద్ద ఎండిన మామిడి తోట

ట్యాంకర్ ద్వారా తడులు అందిస్తున్నా



బోరుబావిని నమ్ముకుని రెండు ఎకరాల్లో టమోటా పంట సాగు చేశా. పూత, పిందె దశలో ఉంది. వర్షాభావ పరిస్థితులతో బోరులో నీరు రాలేదు. పంట ఎండిపోతోంది. దీంతో ట్యాంకర్ నీరు 800 రూపాయలు పెట్టి నీటి తడులు అందిస్తున్నాం. రోజుకు నాలుగు ట్యాంకర్ల నీరు కావాలి. ఇప్పటికే పంట సాగుకు 3 లక్షలు ఖర్చుపెట్టా. బోరు వేసినా ప్రస్తుతం నీళ్లు పడతాయన్న నమ్మకం లేదు. పంటను కాపాడుకోవడం గగనంగా మారింది.

-చలపతి, టమోటా రైతు, రాయచోటి

వరినారు వదిలేశాం

వర్షంపై ఆధారపడి బోరుబావి కింద వరి సాగు చేద్దామని మూడు బస్తాలు విత్తనాలు తెచ్చి నారు పోస్తే బోరుబావిలో నీరు రాలేదు. దీంతో నారు మడి వదిలేసి.. పాడి పశువులు మేపుతున్నా. వర్షాకాలం లోనే ఇలా ఉంటే వేసవి కాలంలో పరిస్థితి ఎలా ఉంటుందో.. సంబేపల్లె మండలం నగిరికి చెందిన మరో రైతు వరి సాగు చేసి నీరు రాక పంట వదిలేశారు.

- జనార్ధన్‌నాయుడు, రైతు, బొగ్గులవారిపల్లె

బోరు బావి తవ్వించాం...



పొలం గుత్తకు తీసుకుని టమోటా పంట సాగు చేశా. ప్రస్తుతం బోరు బావిలో నీరు రాలేదు. పంట దెబ్బ తినకుండా బోరుబావి తవ్వించాం. నీరు పండింది. 600 అడుగుల లోతులో మోటారు బిగిస్తే వాటర్ గ్యాప్ వస్తోంది. 700 అడుగులపైన నీళ్లు పడ్డాయి. టమోటా పంట ఎండిపోకుండా కాపాడుకునేందుకు తాపత్రయం పడుతున్నా.

-అంజి, రైతు, రాజువారిపల్లె, సంబేపల్లె మండలం


బోరు తవ్విస్తున్న రైతు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


తీవ్రంగా గాయపడిన వెంకట్రమణ వద్ద విలపిస్తున్న ఆయన భార్య

రామాపురం, సెప్టెంబరు 18: మండలంలోని చిట్లూరు సమీపంలో బుధవారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పురం వెంకట్రమణ (60) మృతి చెందగా.. మరో వ్యక్తి లక్ష్మీనారాయణకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... నల్లగుట్టపల్లి పంచాయతీ కొత్తపల్లెకు చెందిన వెంక ట్రమణ, ఆయన బామ్మార్ది లక్ష్మీనారాయణ బుధవారం ఉదయం గాలివీడు నుంచి మోటారు బైక్‌లో వస్తుండగా చిట్లూరు సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో వెంకట్రమణ కుడికాలు పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకట్రమణ మృతి చెందాడు. లక్ష్మీనారాయణ చికిత్స పొందుతున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి


కుళ్లాయప్ప మృతదేహం

సింహాద్రిపురం, సెప్టెంబరు 18: మండలంలోని పైడిపాళెం గ్రామానికి చెందిన మిడుతూరి కుళ్లాయప్ప(38) పురుగుల మందు తాగి మృతి చెందాడు. సింహాద్రిపురం ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ వివరాల మేరకు... కుళ్లాయప్ప మద్యానికి బానిసయ్యాడు. దీంతో అతని ఆరోగ్యం క్షీణించడంతో కలత చెందిన కుళ్లాయప్ప మంగళవారం సాయంత్రం పురుగులమందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతని తండ్రి ఖాశీం గమనించి చికిత్స నిమిత్తం పులివెందుల ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుళ్లాయప్పకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్ద మరణించడంతో కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైకును ఢీకొన్న లారీ - ఒకరు మృతి

రాజంపేట టౌన్, సెప్టెంబరు 18: రాజంపేట పట్టణానికి సమీపంలో కడప - చెన్నై ప్రధాన రహదారిలో బైకును లారీ ఢీకొనడంతో కళ్యాణ్‌కుమార్(23) మృతి చెందాడు. అనంతపురం జిల్లా వెలిగొండ గ్రామానికి చెందిన కళ్యాణ్ కుమార్ రాజంపేట సిందూర హోటల్‌లో పనిచేస్తున్నాడు. పని నిమిత్తం జాతీయ రహదారిపైకి రాగా.. ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో మృతి చెందాడు. మన్నూరు పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో కువైత్‌లో వ్యక్తి మృతి



సుండుపల్లి, సెప్టెంబరు 18: సుండుపల్లి మండలం ఏటిగడ్డ రాచపల్లికి చెందిన చమర్తి నాగరాజు (45) గుండెపోటుతో కువైత్‌లో మృతి చెందినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. బతుకుదెరువు కోసం భార్య, భర్తలు కువైత్ వెళ్లారు. మంగళవారం నాగరాజుకు గుండెపోటు రావడంతో మృతి చెందాడు. కాగా, నాలుగు సంవత్సరాల క్రితం వీళ్లు సుండుపల్లి నుంచి రాజంపేటకు వెళ్లి జీవనం సాగించేవారు. వీరికి ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. నాగరాజు మృతితో వారి సొంత ఊరిలో విషాదఛాయలు అలుముకున్నాయి. శుక్రవారం ఆయన మృతదేహం కువైట్ నుంచి రావచ్చని బంధువులు తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

సుండుపల్లి, సెప్టెంబరు 18: మండలంలోని జెసి కురవపల్లికి చెందిన హనుమంతు కుటుంబ సభ్యులపై దాడి కేసులో పి.బాబుతో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఇంటి స్థలం విషయంలో ఫిర్యాదు చేస్తున్నారని దాడి చేసినట్లు హనుమంతు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

వీధికుక్కల దాడిలో బాలుడికి గాయాలు



కమలాపురం రూరల్, సెప్టెంబరు 18: నాయీ బ్రాహ్మణవీధిలో జరిగిన కుక్కల దాడిలో తరుణ్ అనే బాలుడు గాయపడ్డాడు. ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న బాలుడిపై కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో పొట్ట, చేతిపై తీవ్ర గాయాలయ్యాయి. కమలాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించనున్నట్లు వైద్యులుతెలిపారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం : కుక్కల దాడిలో బాలుడు గాయపడిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ఆ కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి బాలుడికి అవసరమైతే మెరుగైన చికిత్స అందించాలని ఫోన్ ద్వారా తెలిపారు.

రూ.9లక్షలతో వైకుంఠ రథం వితరణ


రాగిమాను ప్రతాప్‌కుమార్‌ను సత్కరిస్తున్న బలిజసేవా సంఘం నాయకులు

బద్వేలుటౌన్, సెప్టెంబరు 18: కులమతాలకు అతీతంగా నిరుపేదలు వైకుంఠ రథాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏసియన్ డిజిటల్ కేబుల్ అధినేత, టీడీపీ నేత రాగిమాను ప్రతాప్‌కుమార్ అన్నారు. బుధవారం బలిజసేవా సంఘానికి సుమారు రూ.9లక్షలు విలువచేసే వైకుంఠ రథాన్ని వితరణ చేశారు. తన తండ్రి రాగిమాను రంగయ్య, మేనమామ దేవిరెడ్డి తిరుపాలయ్య జ్ఞాపకార్థం వైకుంఠరథాన్ని, బాడీఫ్రీజర్‌ను ఇవ్వడం జరిగిందన్నారు. నిరుపేదలు ఎవరైనా సరే కులమతాలకు అతీతంగా వైకుంఠ రథం కావాల్సిన వారు బలిజసేవా సంఘంను సంప్రదిస్తే ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం బలిజ సేవాసంఘం నాయకులు రాగిమాను ప్రతాప్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. బలిజసేవాసంఘం అధ్యక్షుడు దద్దం వెంకటేశ్వర్లు, కొర్రపాటి సురేంద్ర, సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, చిన్నసుబ్బారావు, కొంకుల రాంబాబు, ఆవుల శ్రీనివాసులు, బుజ్జి, నానబాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదు

- కస్తూర్బా వసతిగృహం తనిఖీలో కలెక్టర్


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

వీరబల్లి, సెప్టెంబరు 18: విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా కేజీబీవీ జూనియర్ కళాశాలను, వసతి గృహాన్ని పటిష్టంగా నిర్వహించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం వీరబల్లి మండలంలోని కేజీబీవీ జూనియర్ కళాశాల వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహం కెపాసిటీ ఎంత, ప్రస్తుతం ఉన్న విద్యార్థినుల సంఖ్య ఎంత, రోజువారీ మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా, వసతి గృహ నిర్వహణ, విద్యార్థినులకు పాఠాల బోధన, ఉపాధ్యాయుల పనితీరు తదితర అంశాల్లో కేజీబీవీ నిర్వాహకులకు, విద్యార్థినులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినులందరూ బాగా చదువుకొని భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. కష్టపడిన వారికి కచ్చితమైన ఫలితం లభిస్తుందని, కేవల చదువుకున్నామని కాకుం డా సృజనాత్మకత జోడించి విద్యా ప్రమాణాలను మెరుగుపర్చుకోవాలని, ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాకారం చేసుకోవాలని తెలిపారు. అనుమతి లేకుండా ఇతరులను, బయటి వారిని ఎవరినీ వసతి గృహంలోకి అనుమతించరాదని, విద్యార్థినుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థినులతో మమేకమై వారితో పాటు కూర్చుని భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్, కేజీబీవీ జూనియర్ కళాశాల వసతి గృహ నిర్వాహకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఎల్ఎల్‌బీ సెమిస్టరు పరీక్షలు


హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 18: జిల్లాలో ఎల్ఎల్‌బీ సెమిస్టరు పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను వైవీయూ రిజిస్ట్రారు ప్రొఫెసరు రఘునాథరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసరు ఎస్.ఈశ్వర్‌రెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలించారు. ఈపరీక్షలకు తొలిరోజు 511 మంది హాజర య్యారు. 33 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల విభాగం ముఖ్య పర్యవేక్షకులు ప్రొఫెసరు పద్మ తెలిపారు. పరీక్షల నిర్వహణలో సహాయ పర్యవేక్షకులుగా డాక్టర్ లక్ష్మీప్రసాద్, మునికుమారి, సిబ్బంది చంద్రమౌళి పాల్గొన్నారు.

రాయచోటి డీఎస్పీగా కృష్ణమోహన్

రాయచోటి టౌన్, సెప్టెంబర్ 18: రాయచోటి డీఎస్పీగా కృష్ణమోహన్‌ను నియమిస్తూ డీజీపి ద్వారకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు, విశాఖపట్నం, ఏలూరు, కర్నూలు రేంజ్‌ల పరిధిలో సీఐలుగా పని చేస్తున్న 14 మంది సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతులు కల్పించడంతో పాటు పోస్టింగులు ఇచ్చారు. ఇందులో భాగంగానే కర్నూలులో సీఐలుగా పనిచేస్తున్న కృష్ణమోహన్‌కు రాయచోటి డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రామచంద్రరావును బదిలీ చేశారు.

జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ శివరామ్ బదిలీ

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 18: సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ డిప్యూటీ జనరల్ ఇన్‌స్పెక్టర్ శివరామ్ కాకినాడకు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా శివరామ్ మూడేళ్లుగా కడప, అన్నమయ్య జిల్లాల రిజిస్ట్రేషన్ శాఖల డీఐజీగా విధులు నిర్వహించడం గమనార్హం.

అగ్నివీర్ ర్యాలీని విజయవంతం చేయాలి : కలెక్టర్


మాట్లాడుతున్న కల్నల్ పునీత్‌కుమార్, పక్కన కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్) సెప్టెంబరు 18: జిల్లా కేంద్రంలో నవంబరు 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని విజయవంతం చేయాలని కలెక్టర్ శివశంకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణ ఏర్పాట్లపై రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ అదితి సింగ్, రిక్రూట్‌మెంట్ మెడికల్ ఆఫీసరు మేజర్ అమర్ దీప్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌తో కలసి కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అగ్నిపథ్ పథకంలో భాగంగా అగ్నివీర్ ఆర్మీలో జాయిన్ అయ్యే వారి కోసం ఇప్పటికే రాతలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ టెస్ట్‌లు నిర్వ హించేందుకు జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం వేదికగా మారనుందన్నారు. ఈ ఫిజికల్ టెస్ట్‌కు రాష్ట్రంలోని కర్నూలు, నెల్లూరు, అనంతపురం, కడప, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, సత్యసాయి జిల్లాలకు చెందిన అభ్యర్థులు హాజరుకానున్నారు. వారందరికీ మౌలిక సదు పాయాలను కల్పించడంలో కడప నగర పాలకసంస్థ ప్రత్యేక ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల సమన్వయంతో మైదానంలో రిక్రూట్‌మెంట్ బోర్డు విధివిధానాలకు అనుగుణంగా టెంట్లు, బారికేడ్లు, విద్యుత్, తాగు నీరు, టాయిలెట్స్ తదితర మౌలిక ఏర్పాట్లను సమకూర్చాలన్నారు. శాంతిభద్రతలు, పారిశుధ్యం తదితర అంశాలపై సంబంధిత అధికారులకు కలెక్టర్ పలు సూచనలు జారీ చేశారు. అక్టోబరు 15వ తేదీ లోపు మౌలిక ఏర్పాట్లను సమకూర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు నందన్, జిల్లా ఫైర్ ఆఫీసరు ధర్మారావు, డీటీసీ మీరాప్రసాద్, డీఎంఅడ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగ రాజు, ఆర్‌అండ్‌బీ డీఈ మాధవి, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు స్వస్తి పలకాలి

ఎన్ఎఫ్‌పీఈ ఏఐజీడీఎస్‌యూ నేతలు

కడప (మారుతీనగర్) సెప్టెంబరు 18: ఆచరణ సాధ్యం కాని టార్గెట్స్ ఆన్‌లైన్ ట్రైనింగ్ కోర్సుల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా తపాలా కార్యాలయంలో పనిచేసే కింది స్థాయి సిబ్బందిని తీవ్ర ఇబ్బందులకు గురిచేసే పద్ధతులకు అధికారులు స్వస్తి పలకాలని తపాలాశాఖ ఎన్ఎఫ్‌పీఈ, ఏఐజీడీఎస్‌యూ నేతలు డిమాండ్ చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి టార్గెట్స్ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా వివిధ సర్కిళ్లలో సేవలందిస్తున్న సిబ్బందిని ఇబ్బందులు పెడుతున్న తీరు సరికాదన్నారు. బుధవారం ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన డివిజనల్ యూనియన్ నేతలు సుబ్బారెడ్డి, సలాం, రాము, సర్కిల్ నేతలు భానుకృష్ణ, గోవిందు మాట్లాడుతూ ఉన్నతస్థాయి ఉద్యోగుల వేధింపుల కారణంగా చాలామంది అనారోగ్యం పాలవుతున్నారని వాపోయారు. కొందరు డివిజన్, సబ్ డివిజన్ల అధికారులు పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేస్తున్న తీరు బాధాకరమన్నారు. పైపెచ్చు సెలవులు మంజూరు చేయకుండా దూర ప్రాంతాలకు బదిలీ చేస్తామని, ఏపీఏఆర్‌లో గ్రేడింగ్ తగ్గిస్తామంటూ వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మారుమూల గ్రామాల్లో సరైన నెట్‌వర్క్ సదుపాయం లేకున్నా సిబ్బంది మొబైల్ ఫోన్ నెట్‌వర్క్‌తో విధులు నిర్వర్తించాలని హుకుం జారీ చేయడం దారుణమన్నారు. తక్షణమే జులుం చేసే పద్ధతులకు అధికారులు స్వస్తిపలకాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మునాఫ్, రవికాంత్, వెంకట్, రాంబాబు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తి అరెస్టు


నిందితున్ని అరెస్టు చూపుతున్న వన్‌టౌన్ సీఐ

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 18: ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తిని మంగళవారం రాత్రి అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. పోలీసుల కథనం మేరకు పీటీఎం మండలం, పూలగుంటివారిపల్లెకు చెందిన కిరణ్‌కుమార్(33) మదనపల్లెలో నిరుద్యోగుల వద్ద రూ.7.5 లక్షలు వసూళ్లు చేశాడు. తరువాత ఉద్యోగాలు ఇప్పించకుండా ముఖం చాటేశాడు. మోసపోయామని గుర్తించి నిరుద్యోగులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితున్ని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.2.20 లక్షలు రికవరీ చేశారు. కేసు నమోదు చేసి కిరణ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

పిల్లలు పుట్టలేదని.. ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ములకలచెరువు, సెప్టెంబరు 18: పిల్లలు పుట్టలేదని ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన బుధవారం ములకలచెరువులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... ములకలచెరువులోని రాజీవ్‌కాలనీకి చెందిన కె.మహమ్మద్(35)కు బత్తలాపురంకు చెందిన హమీదాతో 13 ఏళ్ల కిందట వివాహ మైంది. పిల్లలు పుట్టకపోవడంతో ఇద్దరూ తరచూ బాధపడేవారు. ఈక్రమంలో హమీదా రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహమ్మద్ ఇంట్లో కిటికీకి చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ గాయత్రి పరిశీలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

- ఇరువురికి గాయాలు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 17: రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో ఇరువురు వ్యక్తులు తీవ్రగాయాలపాలైన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకొంది. నిమ్మనపల్లి పంచాయతీ దిగువవీధికి చెందిన మల్లప్ప, వెంకోజిగారిపల్లెకు చెందిన మహిళ కలిసి బాలినాయునిపల్లిలో మేస్త్రీ పనులకు వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా ఇండియన్ గ్యాస్ గోడౌన్ వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో మల్లప్ప, మహిళకు తీవ్ర గాయాలు కాగా, మరో వాహనంలో ఉన్న వెంకటరమణకు స్వల్పగాయాలయ్యాయి.

'దివ్యాంగులకు డిజిటల్ విద్య'పై శిక్షణ



మాట్లాడుతున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి

రాయచోటి (కలెక్టరేట్) సెప్టంబరు 18: దివ్యాంగ విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించి వారిలో అభ్యసన నైపుణ్యాలు పెంపొందించడంపై బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఈవో శివప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త జనార్దన్, సునీల్‌కుమార్, మహాలక్ష్మి నాయుడు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయం ప్రారంభం

రాయచోటి (కలెక్టరేట్) సెప్టెంబరు 18 : పట్టణంలోని బోస్ నగర్‌లో బుధవారం రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి జిల్లాలోని ఎమ్మెల్యేలతో కలసి వైసీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో వైసీపీ బలోపేతానికి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పార్టీ నిరంతరం కృషి చేస్తారని తెలిపారు. అనంతరం రమేష్‌రెడ్డి మాట్లాడుతూ..కూటమ ప్రభుత్వంలో సంక్షేమ కార్యక్రమాల ఊసే లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే లు చింతల రామచంద్రారెడ్డి, నిస్సార్ అహ్మద్, కొరముట్ల శ్రీనివాసులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మండల పూజ

పెనగలూరు, సెప్టెంబరు 18 : మండలంలోని పి.కొత్తపల్లెలోని శ్రీకరి సిద్ధి వినాయకస్వామి దేవాలయంలో బుధవారం. తలమంచి రమణారెడ్డి, చంద్రకళ దంపతుల ఆధ్వర్యంలో మండల పూజ నిర్వహించారు. గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య ఆధ్వర్యంలో జూటూరు నరసింహశాస్త్రి, పండితుల బృందం 40 రోజుల కిందట నిర్మించిన యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అగస్త్యేశ్వరాలయంలో పల్లకి ఉత్సవం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 18: పట్టణంలోని దాక్షాయణి సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా పల్లకి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాక్షాయణి, అగస్తే శ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి మాడవీధుల్లో పల్లకిపై ఊరేగించారు.

దీపస్తంభం విరాళం

లక్కిరెడ్డిపల్లె సెప్టెంబరు 18: మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత(బాలుర) పాఠశాలకు 13 వేల రూపాయల విలువ చేసే కంచు దీపస్తంభాన్ని సాంఘిక శాస్త్ర ఉపాధ్యా యురాలు సుబ్బలక్ష్మి, సుబ్రమణ్యం దంపతులు అందజేశారు. ఎంపీడీవో వెంకరామిరెడ్డి, ఎంఈఓ వెంకట సుబ్బయ్య, ఈఓపీఆర్‌డీ పట్నాయక్, హెచ్‌ఎం వెంకటేశ్వరులు, ఉపాధ్యాయులు వరలక్ష్మిదేవి, సుజాత, కృష్ణమ్మ, ఆంజనేయులు, హెచ్ సి శ్రీనివాసులు, ఉమాబాయి, చలపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు

అంగన్వాడీ సమస్యలపై కలెక్టర్‌కు వినతి..

రాయచోటి (కలెక్టరేట్) సెప్టెంబరు 18: తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ పి. నాగేశ్వరి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ...యాప్‌ల పేరుతో తమను కింది స్థాయి అధికారులు బెదిరిస్తున్నారని, ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్ పని చేయడం లేదన్నారు. తమతో 14 రకాల రికార్డులు రాయిస్తున్నారని తెలిపారు. 2017 నుంచి ప్రభుత్వం టీఏ, డీఏలు చెల్లించడం లేదన్నారు. వీటిని పరిశీలించి బకాయలు వెంటనే వచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విన్నవించినట్లు తెలిపారు.

ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

- గత ప్రభుత్వంలో వివక్ష
- సబ్‌కలెక్టర్‌కు 'అన్నమయ్య' బాధితుల వినతి

రాజంపేట, సెప్టెంబరు 18: వరద నష్ట పరిహారం చెల్లింపులో గత ప్రభుత్వం వివక్ష పాటించిందని, ప్రస్తుత ప్రభుత్వమైనా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి తమను ఆదుకోవాలని అన్నమయ్య ప్రాజెక్టు ముంపుబాధిత గ్రామాల ప్రజలు సబ్‌కలెక్టరు వైఖోం నిధియాదేవికి విన్నవించారు. బుధవారం ఆమె అన్నమ్మయ్య బాధిత మందపల్లె, శేషమాంబపురం, పులపత్తూరు, గుండ్లూరు, తాళ్లపాక గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మందపల్లె టీడీపీ నేత కొండా శ్రీనివాసులు, ఇతర గ్రామాల ప్రజలు మాట్లాడుతూ మందపల్లె, తొగురుపేట, శేషమాంబపురం, గుండ్లూరు గ్రామాల్లో ఎక్కువ ప్రాణ, ఆస్తినష్టం సంభవించిందని తెలిపారు. అయితే, వైసీపీకి అనుకూలంగా ఉన్న పులపత్తూరు లాంటి గ్రామాల ప్రజలకు మాత్రమే నష్టపరిహారం అందిందని మిగిలిన గ్రామాలపై వివక్ష చూపారని వాపోయారు. వరద కారణంగా తమ గ్రామంలో పలువురు ప్రాణాలు కోల్పోయారని మందపల్లె వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాలు మొదలయ్యాయని, వరద వస్తే తమ గ్రామంలో మళ్లీ ప్రాణ నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయిని ఆందోళన వ్యక్తం చేశారు. వెను వెంటనే రక్షణగోడలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ గ్రామంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని, పంటనష్టం, ఆస్తినష్టం, ప్రాణనష్టం, పశు నష్టం అన్నిరకాల నష్టం జరిగినా తమకు సరైన న్యాయం జరగలేదన్నారు. తమకు ప్రత్యేక ప్యాకేజి ప్రకటించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.


'అన్నమయ్య' బాధితులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నిధియాదేవి

ఈ మేరకు వినతి పత్రాలు సమర్పించారు.

మినీ గురుకులంలో సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

రైల్వేకోడూరు(రూరల్): మండలంలోని గిరిజన మినీ గురుకుల పాఠశాలను బుధవారం సాయంత్రం రాజంపేట సబ్ కలెక్టర్ నిధియాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న సమస్యలు, ఇబ్బందులు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. రైల్వేకోడూరు ఆర్‌ఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా మాన్యం భూముల ఆక్రమణ

- జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్

సుండుపల్లె, సెప్టెంబరు 18: మండలంలోని మాన్యం భూములు ఆక్రమణకు గురయ్యాయని జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్ తెలిపారు. బుధవారం మండలంలోని సుండుపల్లెమ్మ, కార్తికేయ నగర్‌లోని సుబ్రమణ్యంస్వామి, ఓదేటమ్మ ఆలయాల మాన్యం భూములను ఆయన పరిశీలించారు. వాటితో పాటు మరికొన్ని చోట్ల దేవదాయశాఖకు సంబంధించిన భూములు అన్యాక్రాంతం కాగా, ఓదేటమ్మ మాన్యంలో ఏకంగా ప్లాట్లు వేసి విక్రయాలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. 511 సర్వే నెంబరులోని మాన్యం భూమిలో ఇతరుల ప్లాట్లకు వెళ్లేందుకు తారు రోడ్డు వేశారన్నారు. అక్కడ 5.14 ఎకరాల దేవుని మాన్యం ఉందన్నారు. అందులో ప్లాట్లు వేసి విక్రయించినట్లు స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి అన్యాక్రాంతమైన భూముల వివరాలు వెలికి తీస్తామన్నారు. ఒకసారి దేవదాయశాఖ పేరుతో రిజిస్ట్రేషన్ అయితే ఆ భూములు అమ్మేందుకు అధికారులకు కూడా అనుమతి లేదన్నారు. ఈవో కొండారెడ్డి, టీడీపీనాయకులు మాలేపాటి సురేశ్‌నాయుడు, దొరస్వామి నాయుడు, మస్తాన్, శివ, విశ్వనాథ్ పాల్గొన్నారు.


ఓదేటమ్మ ఆలయ భూమిలో ఆక్రమణలను పరిశీలిస్తున్న జిల్లా దేవదాయశాఖ అధికారి

ఆలయాల అభివృద్ధికి కృషి

సుండుపల్లె: మండల కేంద్రంలోని విరుపాక్షి చెన్నకేశవస్వామి ఆలయాన్ని జిల్లా దేవదాయ శాఖ అధికారి విశ్వనాథ్ పరిశీలించారు. ఆలయంలో గడ్డి పెంపకంతో పాటు పలు విషయాలపై ఫిర్యాదులు అందడంతో పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. నిత్యం భక్తులు వచ్చే ఆలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆలయంలోని చెత్తాచెదారాన్ని గడ్డిని తొలగించాలన్నారు. ఆలయానికి ప్రహరీ గోడ నిర్మించాలని, ఆలయ గర్భగుడిలో పైకప్పు నుండి వర్షపు నీరు కారుతోందని భక్తులు చెప్పడంతో మరమ్మతులకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి సుబ్రమణ్యంస్వామి రాజీనామా చేశారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా రాజీనామా చేస్తున్నానని రాజీనామా పత్రాన్ని జిల్లా అధికారికి అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 18 : ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడులు తగ్గుతాయని చిన్న ఓరంపాడు రైతు సేవా కేంద్రం ఇన్‌ఛార్జి నందిని తెలిపారు. రసాయన రహితంగా పండించడం కారణంగా అధిక ధరకు విక్రయించవచ్చన్నారు. సాధారణంగా మనచుట్టూ ఉండే మొక్కల ద్వారా కషాయాలు తయారు చేసుకుని వాడటం ద్వారా ఎంతో మేలు పొందవచ్చునని ఎంసీఏ బుల్లయ్య తెలిపారు. కమ్మపల్లె రైతు శంకరయ్య జీవామృతం తయారీ, వినియోగంపై అవగాహన కల్పించారు. క్రాప్‌బుకింగ్ చేశారు. ప్రతిరైతు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీఆర్‌పీ సహదేవయ్య, రైతులు పాల్గొన్నారు.

డేంజర్ జోన్‌లోని ప్రతి కుటుంబానికి ఇంటి స్థలం


ఇంటిపట్టాలు పంపిణీ చేస్తున్న గునిపాటి చెన్నరాయుడు, రామసుబ్బారెడ్డి

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 18 : డేంజర్‌జోన్‌లోని మంగంపేట, కాపు పల్లె, హరిజనవాడ, అరుంధతివాడ వాసులకు నూతన పునరావాస కేంద్రం ఆర్ ఆర్ -5లో ఇంటిపట్టాలను పంపిణీ చేశారు. మండల మాజీ ఉపాధ్య క్షుడు గునిపాటి చెన్నరాయుడు, పులపత్తూరు రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఆర్‌ఆర్-2 లో గ్రామ సర్వేకు గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.

రైల్వేకోడూరు సబ్‌డీఎఫ్‌వోగా సుబ్బరాజ్

అమరావతి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు సబ్ డీఎఫ్‌వోగా జి.సుబ్బురాజ్ నియమితులయ్యారు. 2022 బ్యాచ్ కు చెందిన ముగ్గురు ఐఎఫ్ఎస్ అధికారులకు శిక్షణ అనంతరం పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఆయన రైల్వేకోడూరుకు నియామకం పొందారు.

రాజగోపాల్‌రెడ్డికి ఆర్ ఆర్ సోదరుల నివాళి


ఆర్‌ఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి, హేమలతమ్మ తదితరులు

లక్కిరెడ్డిపల్లె సెప్టెంబరు 18: మాజీ మంత్రి రెడ్డెప్పగారి రాజగోపాల్‌రెడ్డి 11వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆర్‌ఆర్ ఘాట్ వద్ద రాజగోపాల్‌రెడ్డి సతీమణి హేమలతమ్మ, మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్ శ్రీనివాసులురెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. వెలిగల్లు, చక్రాయపేట, కాలేటి పాశెం, చిన్నపోతుల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిన ఘనత ఆర్‌ఆర్‌దే నని కుమారులు కొనియాడారు. ఉమ్మడి కడప జిల్లాకు ఎనలేని సేవలందించారన్నారు. కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి మాట్లాడుతూ తమ మామగారి అడుగుజాడల్లో పయనించి, ఆర్‌ఆర్ కుటుంబ పేరు ప్రతిష్టలు నిలబెడతానన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు రామాపురం రమేష్ రెడ్డి, కాలాడి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, అన్నంపల్లె రామ్‌ప్రసాదురెడ్డి, అభిమానులు పాల్గొన్నారు

కృత్రిమ మేధస్సుపై అవగాహన సదస్సు

రాజంపేట, సెప్టెంబరు 18: కృత్రిమ మేధస్సు. సాంకేతిక పరివర్తన అంశంపై రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీలో బుధవారం వర్క్‌షాపు నిర్వహించారు. తిరుపతికి చెందిన వెన్సీ టెక్నాలజీస్ శిక్షకులు జె.దుర్గా, కె. యశ్వంత్ మాట్లాడుతూ. విద్యార్థులు కేవలం సాంకేతిక నైపుణ్యాలు మాత్రమే కాకుండా వాస్తవ ప్రపంచ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి మార్గం ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, హెచ్‌వోడీ హరికృష్ణ, కోఆర్డినేటర్‌లు పెంచలయ్య, స్వర్ణ, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సంబేపల్లె, సెప్టెంబరు 18: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఎంపీడీవో సునీల్‌కుమార్ తెలిపారు. బుధవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం నారాయణరెడ్డిపల్లె సచివాలయం వద్ద మొక్కలు నాటారు. దుద్యాల గ్రామ సర్పంచ్ ఎద్దుల లక్ష్మిదేవి, ఆమె భర్త ఎద్దుల చెన్నప్ప పంచాయతీ సెక్రటరీ మోహన్ బాబు సచివాలయం వద్ద తల్లి పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి పరిరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. వాతావరణ కాలుష్యంతోరాబోవు రోజుల్లో మానవ మనుగడ కష్టతరంగా మారుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో చెత్తదిబ్బలను గుర్తించి పారిశుధ్య పనులు చేపట్టాలని తెలియజేశారు. నారాయణరెడ్డిపల్లె సచివాలయ ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రవీంద్ర, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విద్యారులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు 2కే రన్, సైక్లింగ్ పోటీలను నిర్వహించి మొదటి మూడు స్థానాలు పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ, సచివాలయం సిబ్బంది, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : వైకోట గ్రామ పంచాయతీలోని జడ్పీ హైస్కూల్‌లో ఎంపీడీవో విజయరావు అధ్యక్షతన జడ్పీ హైస్కూల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులకు 2కే రన్ నిర్వహించారు. వీధుల్లో తిరుగుతూ ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రాజు, టీడీపీ నాయకులు బొక్కసం చలపతి, మాజీ సర్పంచ్ అడపాల బాలాజీ, సుబ్రమణ్యం, రవి తదితరులు పాల్గొన్నారు.


ఓబులవారిపల్లి: జెండా ఊపి 2కె రన్ ప్రారంభిస్తున్న ఎంపీడీవో విజయరావు

రాయచోటిటౌన్: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో కార్య నిర్వహణాధికారి డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఆలయ ప్రాకా రంతో పాటు మండపాలను శుభ్రం చేశారు. భక్తులు చెత్త, వాటర్‌బాటిళ్లు తదితరాలను ఆలయ ప్రాంగణంలోని డస్ట్‌బిన్‌లలో వేసి సహకరించాలని కోరారు.

సుండుపల్లె: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పారిశుధ్యంపై క్విజ్ నిర్వహించినట్లు ఎంపీడీవో రామచంద్ర బుధవారం తెలిపారు. మనం బాగుండాలంటే మన పరిసరాలు బాగుండాలని విద్యార్థులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం జయన్న, పంచాయతీ కార్యదర్శి సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



పిచ్చెక్కి మాట్లాడుతున్న వైసీపీ నేతలు

- మీడియా సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా

రాయచోటిటౌన్, సెప్టెంబరు 18: రాష్ట్ర ప్రజలు ఛీ కొట్టడంతో అధికారం కోల్పోయిన వైసీపీ నేతలు పిచ్చి పట్టి మాట్లాడుతున్నారని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా ఆరోపించారు.. వైసీపీ పాలనలో రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కు వెళ్లిపోయిందని, ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి కబ్జాలు, హత్యలు, దాడులు, దౌర్జన్యాలను ప్రోత్సహించి రాష్ట్రాన్ని హత్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని ఆరోపించారు. బుధవారం ఆయన రాయచోటి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ నవరత్నాల పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి అన్ని వ్యవస్థలను ధ్వంసం చేశాడని మండిపడ్డారు. త్వరలో వైసీపీ గంప ఖాళీ అయిపోతుందని జోశ్యం చెప్పారు. రాయచోటిలో నాలుగు దఫాలు ఎమ్మెల్యేగా ఉన్న శ్రీకాంత్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏందో చెప్పాలన్నారు. మంత్రిగా మండిపల్లిరాంప్రసాద్‌రెడ్డి నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నారన్నారు. టీడీపీ నేతలు వెంకట్రామిరెడ్డి, జయరామిరెడ్డి, మట్లి శ్రీనివాసులునాయుడు, శివారెడ్డి, సంజీవరెడ్డి, జాఫర్‌అలీఖాన్, రామరాజు, విష్ణువర్ధన్ రెడ్డి, సురేశ్‌రెడ్డి, దేవేంధర్‌రెడ్డి, ఎన్నారై నరసింహ నాయుడు, ప్రొఫెషనల్ వింగ్ ప్రెసిడెంట్ హరియాదవ్, ఇర్ఫాన్, అశోక్ పాల్గొన్నారు.

టీచర్ కొట్టాడని తల్లిదండ్రుల ఫిర్యాదు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 18 : ఉపాధ్యాయుడు కొట్టడంతో తమ కుమారుడికి వాతలు పడ్డాయని తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదు చేశారు. మండలపరిధిలోని రాచపల్లె జడ్పీ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న ఏడుకొండలు అనే విద్యార్థిని ఉపాధ్యాయుడు రాజాబాబు కర్రతో కొట్టాడని, తమ కుమారుడు తప్పు చేయకున్నా గాయాలయ్యేలా కొట్టాడని, విద్యార్థి తప్పును చూపాలని తల్లిదండ్రులుడిమాండ్ చేశారు. దీనిపై ప్రధానోపాధ్యాయుడు రత్నం మాట్లాడుతూ క్లాసురూంలో విద్యార్థి హేళనగా ప్రవర్తించడంతో మందలించారని, అంతే తప్ప దురుద్దేశ్యంతో కొట్టలేదని ఆయన వివరించారు.

నియోజకవర్గంపై సీఎంకు సుగవాసి నివేదిక


సీఎంకు నివేదిక అందజేస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేట, సెప్టెంబరు 18: రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల నేతలతో మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమావేశంలో రాజంపేట నియోజకవర్గ టీడీపీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న పలు పరిణామాలను చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు, ప్రధాన సమస్యలు, తక్షణ అభివృద్ధి కార్యక్రమాలపై నివేదిక అందజేశారు. నియోజకవర్గంలోని టీడీపీ పటిష్టంపై దృష్టి సారించాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు.

ప్రజల దాహార్తి తీర్చడమే కర్తవ్యం


పూజలో పాల్గొన్న మండిపల్లి లక్ష్మిప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, సెప్టెంబరు 18: రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి సమస్య ఉన్న ప్రతిచోట ప్రజల దాహం తీర్చడమే తమ కర్తవ్యం అని రాష్ట్ర రవాణా, యువ జన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు మండిపల్లి లక్ష్మి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం సంబేపల్లె మండల కేంద్రంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు బోరు బండికి పూజలు చేసి తవ్వకం ప్రారంభించారు. మంగళవారం మాధంవాండ్లపల్లెలో బోరు వేశారు. ప్రతిపల్లెలో తాగునీరు కల్పించి ఆదుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనసన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యాశాఖ అధికారులు

రామాపురం, సెప్టెంబరు 18: మండల పరిధిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పిచ్చిరెడ్డి, మనోహర్, భూషణ్ రెడ్డి, వసుంధర, అమృతవల్లి, రాణి, శ్రీరాములునాయక్, రెడ్డెయ్యను నీలకంఠ్రావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించినట్లు ఎంఈవోలు రామకృష్ణుడు, జయచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుజాత, హిలాల్, ఉపాధ్యాయ సంఘ నాయకులు రామచంద్ర, గోపీకృష్ణ, వెంకట్రామి రెడ్డి, విశ్వనాథ, ఇతర నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అన్నమయ్య బాధితులకు సాయం'పై ఫిర్యాదు

నందలూరు, సెప్టెంబరు 18 : అన్నమయ్య ప్రాజెక్టు బాధితులకు నష్టపరిహారం ఇవ్వకున్నా, ఇచ్చినట్లు ధ్రువపత్రాలు మంజూరు చేసిన అంశంపై విచారణ చేసి అందుకు కారకులైన అధికారులు, నాయకులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి బుధవారం రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవిని కోరారు. దీనికి సబ్‌కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. పూర్తి విచారణ చేసి, బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఎద్దుల విజయసాగర్, లేబాక సర్పంచ్ నరసయ్య, టంగుటూరు ఎంపీటీసీ సభ్యుడు పెంచలయ్య, సత్తుపల్లె వెంకటేశ్, టంగుటూరు హరి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, దిలీప్‌కుమార్

సంబేపల్లె, సెప్టెంబరు 18: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ క్రీడా పోటీలను ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ ప్రారంభించారు. క్రీడా పోటీల కన్వీనర్లు సురేంద్రరాజు, అమర్‌నాథరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సోమశేఖర్‌రెడ్డి, సునీత, షామీర్, ఉపాధ్యాయులు భాస్కర్, చంద్రశేఖర్‌రాజు, మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 18: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రైల్వేకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 26న పుల్లంపేట మండలం ఏపీ మోడల్ స్కూలులో సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, క్రికెట్, 27న తైక్వాండో, కరాటే, తంగటా, కురేష్, ఉషు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు బుధవారం స్కూలు గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి శారద తెలిపారు. క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఆమె కోరారు.

మండల స్థాయి ఆటల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులతో స్కూల్ యాజమాన్యం

రైల్వేకోడూరు(రూరల్), సెప్టెంబరు 18: మండల స్థాయి ఆటల పోటీల్లో డాల్ఫిన్ డెల్ స్కూల్ విద్యార్థులు 12 పతకాలతో రాణించారు. అథ్లెటిక్స్ అండర్ 14, అండర్ 17 విభాగంలో వరుణ్, అభిషేక్, రేవంత్, హసిని, శ్వేత, కార్తీక్, దీక్షిత్, యజ్ఞ, సన్నిహిత బంగారు పతకాలు సుశాంత్, అభిషేక్ వెండి పతకాలు, రష్మీ కాంస్య పతకం సాధించినట్లు కరస్పాండెంట్ సుకుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీ మనోజ్, హెచ్ఎం బాల కుమార్, ఇన్‌చార్జ్ చెంగయ్య సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

గాలివీడు, సెప్టెంబరు18: ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న టీకాలను రైతులు విధిగా ఉపయోగించుకోవాలని డీఎల్డీఏ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమేశ్, వీఏఎస్ డాక్టర్ శివరామిరెడ్డి, రాయచోటి ఉపసంచాలకులు డాక్టర్ మాలకొండయ్య సూచిం చారు. బుధవారం గాలివీడు మండలం అరవీడు శ్రీనగర్‌కాలనీలో లేగదూడల ప్రదర్శన, ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 38 పశువులకు వైద్యం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయచోటి సహాయ సంచాలకులు శివారెడ్డి, మండల పశువైద్యాధికారి డాక్టర్ భాస్కర్, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

రామాపురం, సెప్టెంబరు18: సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రామాంజులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక హరిహరాలయం ఆశ్రమం ఎదుట బుధవారం మండల సీపీఎం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజులు మాట్లాడుతూ టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు సాగునీరు అందించడంలో విఫలమయ్యాయన్నారు. హంద్రీనీవా, గాలేరు-నగిరి ప్రాజెక్టుల నిర్మాణం మానేసి, రెండు పార్టీల నాయకులు వ్యక్తిగత విమర్శలు చేసుకుంటున్నారని ఆరోపించారు. వెలిగల్లు నీరు వృథా కాకుండా, మండిపల్లి రిజర్వాయర్, గంగనేరు తదితర చెరువులను నింపాలన్నారు. ఝరికోన కింద పంట కాల్వల్లో పూడిక తీయాలన్నారు. ఈ అంశాలపై ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు . సీపీఎం నాయకులు నాగబసిరెడ్డి, శివరాం, ఈశ్వరయ్యలు పాల్గొన్నారు.

నష్టపోయిన నేతన్నలకు సాయం అందించాలి


మగ్గాలను పరిశీలిస్తున్న ఓర్సు వీరభాస్కర్

గాలివీడు, సెప్టెంబరు 18: భారీ వర్షాల కారణంగా నష్టపోయిన నేతన్నల కుటుంబాలకు రూ.50 వేలు పరిహారం చెల్లించాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ చేనేత రాష్ట్ర అధ్యక్షుడు ఓర్సు వీరభాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం గాలివీడు మండలంలో బుధవారం ఆయన మగ్గాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో భారీ వర్షాల కారణంగా పూర్తిగా నష్టపోయిన నేతన్నలు వలస వెళ్లి కూడి పనులు చేసుకునే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు శిబ్యాల వెంకట్రమణ, మండెం రాము, ఓర్సు ఆంజనేయులు, ఓర్సు పవన్‌కుమార్, నాగయ్య, లక్ష్మినారాయణ, కొంగ జయరాం, శిబ్యాల రాంప్రసాద్, పురం వెంకటేశ్ పాల్గొన్నారు.

నేడు కుప్పంలో పీజీఆర్ఎస్ రద్దు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 18: కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దుచేసి, వచ్చే వారానికి మార్పుచేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇసుక వెబ్‌సైట్‌ను గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభిస్తున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని మార్పు చేసినట్లు పేర్కొన్నారు.

66 మంది డీటీల బదిలీ

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 18: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ సూచనల మేరకు మండల కేంద్రాల్లోని డిప్యూటీ తహసీల్దార్లు (డీటీలు) 25 మందిని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ బదిలీ చేశారు. అలాగే రీ సర్వే విధులు నిర్వహిస్తున్న డీటీలు 26 మంది, ఎన్నికల విభాగంలో పనిచేస్తున్నవారు నలుగురు, నాలుగు ఆర్డీవో కార్యాలయాల్లో పనిచేస్తున్న డీటీల్లో ఐదుగురు, డీఎస్వో ఆఫీసులో పనిచేస్తున్న డీటీలు ఆరుగురిని కూడా బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఉమ్మడి జిల్లాలో 17 మంది వీఆర్వోల బదిలీలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి 17మంది వీఆర్వోలను అంతర్ జిల్లాలకు బదిలీ చేస్తూ నోడల్ ఆఫీసర్ అయిన కలెక్టర్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. చిత్తూరు జిల్లాలోని నగరి ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న టి.ప్రదీప్, పులిచెర్ల నుంచి కె.మునిరత్నం, వి.ప్రశాంత్‌కుమార్, బి.మునిరాజ, సోమల నుంచి డి.శ్రీనివాసులు, ఐరాల నుంచి టి.జయబాల, కె.నాగరత్నం, రామకుప్పం నుంచి ఎం.శివనారాయణ, సదుంలో పనిచేస్తున్న సి.ఆంజనేయులును తిరుపతి జిల్లాకు బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తిరుపతి జిల్లాలోని ఎర్రావారిపాళ్యం నుంచి ఎస్.మహబూబ్ బాషా, పుత్తూరు నుంచి డి.సుబ్రహ్మణ్యం, కె.విజయ్‌కుమార్, పాకాల మండలం నుంచి వి.వెంకటరాజేష్, జి.సుబ్రహ్మణ్యం, జి.హరికృష్ణ, తిరుపతి అర్బన్ నుంచి జి.కమల, వై.సుబ్రహ్మణ్యంలను చిత్తూరు జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, సెప్టెంబరు 18: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2024-25 విద్యా సంవత్సరం నాల్గవ విడత ప్రవేశాలకు గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చిత్తూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో iti.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో మాత్రమే చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 29న, ప్రైవేటు వారికి 30వ తేదీన కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 77999 33370 నెంబరును సంప్రదించాలని కోరారు.

సింగిల్‌విండోల్లో ఎరువుల అమ్మకాలు: జేసీ



సమావేశంలో ప్రసంగిస్తున్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 18: సహకార సంఘాల బలోపేతం కోసం ప్రస్తుత ఏడాది నుంచి 14 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (సింగిల్‌విండోలు) ఎరువుల అమ్మకాలకు సహకరించాలని వ్యవసాయశాఖ అధికారులను బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జేసీ విద్యాధరి కోరారు. బుధవారం డీసీసీబీ సర్వసభ్య సమావేశం జేసీ అధ్యక్షతన జరిగింది. బ్యాంకు సీఈవో మనోహర్ గౌడ్ వార్షిక నివేదికను వివరిస్తూ గతేడాది బ్యాంకు రూ.9.66 కోట్లు నికర లాభం ఆర్జించిందని తెలిపారు. రూ.932.14 కోట్లు డిపాజిట్ల రూపేణా వసూలు చేయగా, రైతాంగానికి రూ.2002.25 కోట్లు వివిధ రకాల రుణాలను అందించామని తెలిపారు. ప్రస్తుత ఏడాది బ్యాంకు వ్యాపారం రూ.3600 కోట్లు లక్ష్యంగా నిర్దేశించుకోగా, రుణ పంపిణీకి రూ.2500 కోట్లు, డిపాజిట్ల సేకరణ రూ.1100 కోట్లు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ప్రభుత్వ సూచనల మేరకు ఉమ్మడి జిల్లాలో కంప్యూటరీకరణను నిర్దిష్టమైన ప్రణాళికతో పూర్తి చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో డీసీవో నాగవర్ధన, తిరుపతి డీసీవో లక్ష్మీ, డీఎల్‌సీవో వనజ, వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ, పశు సంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్‌లతో పాటు డీసీసీబీ అధికారులు, సింగిల్‌విండోల పర్సన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

'పీఎం సూర్య ఘర్'ను సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 18: కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను గృహ వినియోగదారులందరూ వినియోగించుకోవాని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమంపై కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ రాయితీ ద్వారా గృహ వినియోగదారులు సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. ఈ పథకానికి బ్యాంకులు ఏడు శాతం తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తాయని తెలిపారు. ఈ ఏడాది 50వేల గృహాలకు రాయితీ ద్వారా సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ ఏర్పాటు లక్ష్యంగా నిర్ణయించినట్లు వివరించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అబ్దుల్ గయాజ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు 18,401 మంది వినియోగదారులు ఈ పథకం కోసం పేర్లు నమోదు చేసుకోగా, 1078 దరఖాస్తులను ఆమోదించినట్లు చెప్పారు. జడ్పీ సీఈవో గ్లోరియా, డీఆర్డీఏ పీడీ తులసి, డీపీవో లక్ష్మి, ఎల్డీఎం హరీష్, విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేంద్ర నాయుడు, నామినేటెడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తిరుమలలో మాదిరి గరుడసేవ



తిరుమల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో అక్టోబరు 4 నుంచి జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం సాయంత్రం మాదిరి గరుడ సేవ నిర్వహించారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున మలయప్పస్వామికి గరుడ సేవ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఏటా బ్రహ్మోత్సవాలకు ముందు పౌర్ణమి రోజున మాదిరి గరుడ సేవ నిర్వహించడం పరిపాటి. తద్వారా బ్రహ్మోత్సవ ఏర్పాట్లను అధికారులు సమీక్షించుకుంటారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగిన గరుడసేవలో టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్ కలిసి నాలుగు మాడవీధుల్లో భద్రత, తాగునీరు పంపిణీ, అన్నప్రసాదాల వితరణ, శ్రీవారిసేవకుల సేవలు, ప్రవేశ నిష్క్రమణ మార్గాలు, ఇతర ఇంజినీరింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. గరుడ వాహనం ముందు గజరాజులు ఠీవిగా నడుస్తుండగా, భజనబృందాలు ప్రదర్శనలు, మంగళవాయిద్యాలు నడుమ పౌర్ణమి గరుడసేవ కన్నులపండువ గా జరిగింది. గరుడ వాహనసేవలో భక్తులు భారీగా పాల్గొని కర్పూర హారతులు పడుతూ గోవిందనామస్మరణలతో స్వామిని దర్శించుకున్నారు.



గరుడ వాహనంపై మలయప్పస్వామిని దర్శించుకోవడానికి తరలి వచ్చిన భక్తజనం

రావణబ్రహ్మపై విఘ్ననాథుడు





ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, ఉభయదారులు - రావణబ్రహ్మ వాహనంపై విహరిస్తున్న సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడు



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 18: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా స్వామి బుధవారం రావణబ్రహ్మ వాహనంపై ఊరేగారు. ఈ కార్యక్రమానికి పుణ్యసముద్రం, లక్ష్మాంబపురం, సంతపల్లె, ద్వారకాపురం, కురప్పల్లె, సిద్ధంపల్లె, ముద్దురామాపురం గ్రామాలకు చెందినవారు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఉదయం ఉభయదారుల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం నిర్వహించాక, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకు రావడంతో ఆలయ అలంకార మండపంలో స్వామి వారి ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహించారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చి రావణబ్రహ్మ వాహనంపై అధిష్ఠింపజేసి, కాణిపాక పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆస్థాన మండపంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విష్ణేష్, రవి ఉభయదారులు పాల్గొన్నారు.

కాణిపాకంలో నేడు

కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా గురువారం వరసిద్ధుడికి యాళి వాహన సేవ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి అగరంపల్లెకు చెందిన ఎ.నరసింహారెడ్డి వారి కుమారులు, చినకాంపల్లెకు చెందిన పి.సుబ్బారెడ్డి వారి కుమారులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారు.





ఆస్థాన మండపంలో నృత్యాలు చేస్తున్న కళాకారులు - గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు

చల్లా బాబుకు భద్రత తొలగింపుపై టీడీపీ శ్రేణుల్లో ఆందోళన



పుంగనూరు, సెప్టెంబరు 18: పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి(చల్లా బాబు)కు ఇటీవల పోలీసు భద్రత తొలగించింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటి నుంచి గన్‌మ్యాన్ ఉండగా కొద్దిరోజుల క్రితం భద్రతను ప్రభుత్వం ఉపసంహరించింది. దీనిపై టీడీపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. గత శాసనసభ ఎన్నికల్లో చంద్రబాబును కుప్పంలో గెలవనియ్యమని అప్పటి వైసీపీ ప్రభుత్వంలోని మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నించిన విషయం తెలిసిందే. దీనికి నాటి ఎస్పీ రిశాంత్‌రెడ్డి, డీఎస్పీ సుధాకర్‌రెడ్డి సహకరించిన విషయమూ విదితమే. అలాగే పెద్దిరెడ్డికి పుంగనూరులో అడ్డులేకుండా చేసుకోవడానికి ప్రతిపక్షాలను కట్టడి చేస్తూ టీడీపీ శ్రేణులు 1000 మందిపై పోలీసుల ద్వారా కేసులు పెట్టి ఎన్నికలకు దూరం చేయాలని వ్యూహం రచించారు. రెండేళ్ల క్రితం సదుం మండలం బూరగమందకు చెందిన టీడీపీ నాయకుడు రాజారెడ్డిని వైసీపీ మూకలు కిడ్నాప్ చేసి దారుణంగా కొట్టారు. ఈ సమయంలో టీడీపీ శ్రేణులకు భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో చల్లా బాబు.. పులిచెర్ల మండలం కల్లూరులో భారీ ఎత్తున నిరసనగా ధర్నా చేశారు. దీనికి అనుమతి లేదంటూ టీడీపీ నేతలపై పోలీసులు లాఠీలు ఝుళిపించి భయభ్రాంతులకు గురిచేశారు. ఆ సమయంలో వైసీపీ కవ్వింపు చర్యలకు పాల్పడగా ఉద్రిక్తత నెలకొంది. అయినా చల్లా బాబుతోపాటు పలువురిపై కేసులు పెట్టారు. సోమల మండలం పెద్దఉప్పరపల్లె, నంజంపేటలో టీడీపీ ఇదేం ఖర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమానికి వెళుతుండగా సోమలలో చల్లా బాబు కారుపై వైసీపీ మూకలు రాళ్లు వేసి అద్దాలు ధ్వంసం చేశారు. అప్పుడూ చల్లా బాబుపైనే కేసులు పెట్టారు. గత ఏడాది ఆగస్టు 4న చిత్తూరుకు చంద్రబాబు ప్రతిపక్ష హోదాలో వచ్చినప్పుడూ పెద్ద గొడవే జరిగింది. ఈ సందర్భంగా చల్లా బాబుతోకలిపి 502 మంది టీడీపీ శ్రేణులపై హత్యాయత్నంతోపాటు కఠిన తరహైన సెక్షన్లతో ఏడు కేసులు పెట్టి కడప, చిత్తూరు, మదనపల్లె జైళ్లలో మూడునెలలు రిమాండులో ఉంచారు. చల్లా బాబుపై 17 పోలీసు కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం చెందినా పుంగనూరు ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీగా మిథున్‌రెడ్డి గెలిచారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పుంగనూరులో చల్లా బాబు హవా సాగుతోంది. ఈ క్రమంలో పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డిలను పుంగనూరులో కూటమి నేతలు, బాధితులు రెండు మార్లు అడుగుపెట్టనియ్యలేదు. దీంతో ఎంపీ, ఎమ్మెల్యేలుగా తమకు రక్షణ లేదని కోర్టును ఆశ్రయించారు. ఇటీవల పుంగనూరులో మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటి వద్ద మిథున్‌ను అడ్డుకోవడం, కూటమి, వైసీపీలు పరస్పర గొడవలు చేసుకోవడంతో తనకు రక్షణ కల్పించాలని లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయనకు కేంద్ర ప్రభుత్వం వై కేటగిరీ భద్రత కల్పించింది. దీంతోపాటు బయట ప్రాంతాలకు చెందిన ప్రైవేట్ సైన్యాన్నీ మిథున్ పెట్టుకున్నారు.

బెదిరింపు ధోరణితో గతంలో మిథున్ ప్రెస్‌మీట్!

ఇటీవల ఎంపీ మిథున్ రెడ్డి తిరుపతిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 'చల్లా బాబు నువ్వు చంద్రబాబు ట్రాప్‌లో పడకు, మా కుటుంబంలో రాజకీయాలు చేయడానికి చాలా మంది ఉన్నాం. నీవు ఒక్కడే ఉన్నావు' అని బెదిరించే ధోరణిలో చెప్పారు. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గంలో చల్లా బాబుతో వైసీపీకి ఇబ్బందిగా ఉందని, ఏదైనా కుట్రకు పాల్పడే అవకాశం ఉంటుందని కుటుంబీకులతోపాటు అనుచరులు, టీడీపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల కొందరు పుంగనూరు టీడీపీ నేతలు సీఎం చంద్రబాబును కలిసి పెద్దిరెడ్డి ఆగడాలను కట్టడి చేస్తున్న చల్లా రామచంద్రారెడ్డికి ఎమ్మెల్సీ లేదా రాష్ట్రస్థాయిలో ప్రాధాన్యం గల పదవి ఇవ్వాలని విన్నవించారు. ఈ నేపథ్యంలో చల్లా బాబుకు ప్రభుత్వం తొలగించిన గన్‌మ్యాన్ల భద్రతను తిరిగి కొనసాగించి అండగా నిలవాలని కోరుతున్నారు.

దారి చూపండి

- చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవే భూ బాధితులు
- సర్వీస్ రోడ్డు కోసం నేడు చిత్తూరులో ధర్నా
- 22న వంటావార్పు
- సీపీఐ జాతీయ నేత నారాయణ రాక



చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవేపై ధర్నా చేస్తున్న రైతులు

పిచ్చాటూరు, సెప్టెంబరు 18: చిత్తూరు - తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవే కోసం భూములు ఇచ్చిన రైతాంగం నోట్లో మట్టి కొట్టేందుకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ యత్నిస్తోందని సీపీఐ, రైతు సంఘం నేతలు పేర్కొన్నారు. మంగళవారం రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను సీపీఐ, రైతు సంఘం ప్రతినిధి వర్గం అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా కారూర్, పాదిరి, బూచవానత్తం, అయనంబాకం, కాళికాపురం, దామరపాకం గ్రామాలకు చెందిన రైతులు మాట్లాడుతూ... సీపీఐ, రైతు సంఘం సహకారంతో తమ భూములకు పరిహారం ఎకరాకు రూ.8 లక్షల నుంచి 16 లక్షలకు పెంచుకో గలిగామన్నారు. అయితే రహదారి పూర్తి కావస్తున్నా ఎంవోయూకు విరుద్ధంగా సర్వీస్ రోడ్డు నిర్మించక పోవడం దుర్మార్గమన్నారు. అలాగే పలు చోట్ల రోడ్డుకిరువైపులా ఉన్న గ్రామాలకు, పొలాలకు సబ్‌వే ఏర్పాటులో పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి బుధవారం చిత్తూరులో ధర్నా, అలాగే 22న రహదారిపైన వంటా వార్పు కార్యక్రమం చేపట్టబోతున్నామని సీపీఐ, రైతు సంఘ నాయకులు ప్రకటించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.రామానాయుడు, రైతు సంఘం నేత జనార్దన్, సీపీఐ జిల్లా నాయకులు చిన్నిరాజ్, మహేష్, గురుమూర్తి, చిరంజీవినాయుడు, కృష్ణారెడ్డి కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూతో బాలిక మృతి

జ్వరాలపై సమగ్ర విచారణకు జడ్పీ చైర్మన్ ఆదేశం



మృతి చెందిన మేఘన

వి.కోట, సెప్టెంబరు 18: వి.కోట పట్టణం ఏపీజే కలాం వీధికి చెందిన హరినాథ్ కుమార్తె మేఘన(13) డెంగ్యూతో చికిత్స పొందుతూ మృతి చెందింది. 8వ తరగతి చదువుతున్న మేఘన వారం రోజులుగా జ్వరం తగ్గక పోవడంతో కుటుంబీకులు బెంగళూరులోని రెయిన్‌బో ఆస్పత్రికి తరలించారు. మంగళవారం సాయంత్రం అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ మృతి చెందింది. రాత్రి మృతదేహాన్ని వి.కోటకు తరలించారు. బుధవారం ఉదయం విషయం తెలుసుకున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు వచ్చి మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఈసందర్భంగా తమ ప్రాంతంలోని గంగమ్మ ఏరులో మురుగు ప్రవహించడం వల్ల దోమలు పెరిగి అందరూ జ్వరాల బారిన పడుతున్నారని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యను ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే వి.కోట పట్టణంలో జ్వరాలపై సమగ్ర విచారణ చేసి, నివేదిక ఇవ్వాలని ఓగు పీహెచ్‌సీ వైద్యుడు రాజేష్‌కు ఆదేశాలిచ్చారు. స్థానిక సర్పంచ్ పీఎస్ లక్ష్మి, ఎంపీడీవో మహ్మద్ రఫీ, ఈవో శివశంకర్‌లు కూడా పారిశుధ్యంపై క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలు చేశారు. బుధవారం రాత్రి పంచాయతీ సిబ్బంది దోమలను నివారణకు ఫాగింగ్, మురుగు నిల్వలపై మలాథీన్ పిచికారీ చేశారు. కాగా, ఏఎంజీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు రంగనాథ్, బీజేపీ, జనసేన, వైసీపీ నేతలు కూడా మృతురాలి కుటుంబీకులను పరామర్శించారు.



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



ఎన్డీయే శాసనపక్ష సమావేశంలో పాల్గొన్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, నగరి, పలమనేరు, గంగాధరనెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు భానుప్రకాష్, అమరనాథరెడ్డి, థామస్, గురజాల జగన్మోహన్, మురళీమోహన్

నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 18: ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తిని మంగళవారం రాత్రి అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. పోలీసుల కథనం మేరకు పీటీఎం మండలం, పూలగంటివారిపల్లెకు చెందిన కిరణ్‌కుమార్(33) మదనపల్లెలో నిరుద్యోగుల వద్ద రూ.7.5 లక్షలు వసూళ్లు చేశాడు. తరువాత ఉద్యోగాలు ఇప్పించకుండా ముఖం చాటేశాడు. మోసపోయామని గుర్తించి నిరుద్యోగులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితున్ని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.2.20 లక్షలు రికవరీ చేశారు. కేసు నమోదు చేసి కిరణ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ - ఇరువురికి గాయాలు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 17: రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో ఇరువురు వ్యక్తులు తీవ్రగాయాలపాలైన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకొంది. స్థానికుల వివరాల మేరకు.. నిమ్మనపల్లి పంచాయతీ దిగువవీధికి చెందిన మల్లప్ప, వెంకోజిగారిపల్లెకు చెందిన మహిళ ఇద్దరూ కలిసి బాలినాయునిపల్లిలో మేస్త్రీ పనులకు వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా ఇండియన్ గ్యాస్ గోడౌన్ వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం బలంగా ఢీకొంది. దీంతో మల్లప్ప, మహిళ ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, మరో వాహనంలో ఉన్న వెంకటరమణకు స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 18: చదువులో ఉత్తమ ప్రతిభ కనపర్చిన కురబ సామాజిక వర్గ విద్యార్థులకు సన్మానం చేయనున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మదనపల్లె డివిజన్ అధ్యక్షుడు ఆర్‌కే శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి మర్రిపాటి రమేష్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు సన్మానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బత్తిని రెడ్డెప్ప, బండిరెడ్డెప్ప, డి.నరసింహులు, రెడ్డికుమార్, ఆంజనేయులు, బాలకృష్ణ, గుడే శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి : డీఎల్‌పీవో

తంబళ్లపల్లె, సెప్టెంబరు 18: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా జీవించవచ్చని, అందుకోసం కృషి చేయాలని డీఎల్‌పీవో నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం తంబళ్లపల్లెలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో డీఎల్‌పీవో, ఎంపీడీవో సురేంద్రనాథ్ పాల్గొన్నారు. అదేవిధంగా తంబళ్లపల్లె సీహెచ్‌సీలో వైద్యాధికారి వెంకట్రామయ్య ఆధ్వర్యంలో ఆసుపత్రి ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం తొలగించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ దిలీప్‌కుమార్, డిజిటల్ అసిస్టెంట్ శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్ నంద, ఆశ కార్యకర్త గీత, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం


మొక్కలు నాటుతున్న కూటమి నాయకులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 18: భారతప్రధాని మోదీ పిలుపుమేరకు బుధవారం స్థానిక శివనగర్‌లో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు బీజేపీ నేత బండి ఆనంద్ ఆధ్వర్యంలో అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజయ భారతి సేతు, వరదారెడ్డిగారి నారథరెడ్డి, జర్మనీరాజు, జనసేన నాయకులు రాందాస్ చౌదరి, జంగాల శివరాం, విద్యోదయ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేతకు నాయకుల పరామర్శ

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 18: మదనపల్లె నియోజకవర్గ జనసేన నేత శ్రీరామ రామాంజనేయులను వివిధ పార్టీల నాయకులు పరామర్శించారు. ఆయన సతీమణి శ్రీరామ నళిని ఆకస్మిక మృతి చెందారు. ఇందులో భాగంగా బుధవారం స్థానిక సీఎస్ఐ కమ్యూనిటీ హాలులో సంతాపసభను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో పాటు టీడీపీ, జనసేన నేతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నళిని చిత్రపటానికి నియోజకవర్గంలోని రామసముద్రం, నిమ్మనపల్లె, మదనపల్లె మండలాల నుంచి టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్ని ఆమె అకాల మరణానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం


లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న దొరస్వామినాయుడు

ములకలచెరువు, సెప్టెంబరు 18: విజయవాడ వరద బాధితుల సహాయార్థం టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత కట్టా దొరస్వామినాయుడు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఉండవల్లిలోని స్వగృహంలో బుధవారం మంత్రి నారా లోకేశ్‌ను కలిసి చెక్కును అందజేశారు. వరద బాధితులకు అండగా నిలిచిన కట్టా దొరస్వామినాయుడును నారా లోకేష్ అభినందించారు.

అభివృద్ధిలో ఎఫ్‌పీవోలు భాగస్వామ్యం కావాలి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్


సమావేశంలో, ఎఫ్‌పీవో ప్రతినిధులకు సూచనలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 18: వర్షాభావంతో వ్యవసాయరంగంలో వెనుకబడిన జిల్లాను 2047 సంవత్సరానికి అభివృద్ధి పథంలో నడిపించడానికి ఎఫ్‌పీవోలు (రైతు ఉత్పత్తి సంఘాలు) భాగస్వామ్యం కావాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీఎల్ఆర్‌సీ భవనంలో ఏపీ మాస్ సంస్థ సీఈవో సీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో ఎం-టమోటా ఉత్పత్తిదారుల కంపెనీ 6వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ వర్షపాతం తక్కువగా నమోదయ్యే జిల్లాలో రైతులు, యువతలో నైపుణ్యం పెంచడానికి ఎఫ్‌పీవోలు కృషి చేయాలన్నారు. జిల్లాలో హార్టికల్చర్ గణనీయంగా పెరుగుతోందని, ముఖ్యంగా టమోటా పంట సాగు చేయడంలో ప్రసిద్ధి చెందిందన్నారు. టమోటా ధరల హెచ్చుతగ్గును గుర్తిస్తూ రైతులకు అవగాహన కల్పించడంలో ఎఫ్‌పీవోలు ముందుకు సాగాలన్నారు. టమోటా రైతులు దళారుల బాధ పడకుండా ఢిల్లీ వంటి సుదూర ప్రాంతాలకు రైళ్లలో ఎగుమతులు సాగించి, లాభాలను పొందేందుకు ఎఫ్‌పీవోలు పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల ప్రణాళికతో జిల్లా అభివృద్ధికి యంత్రాంగం పనిచేస్తుందన్నారు. జిల్లాలో వ్యవసాయ అనుబంధశాఖల ద్వారా రైతులకు శిక్షణ ఇస్తున్నామని, ఎఫ్‌పీవోలు కూడా సమష్టిగా పనిచేసి విజయాలు సాధించాలన్నారు. ఎన్ఐఆర్డీ మాజీ డీజీ డబ్ల్యూ.ఆర్.రెడ్డి మాట్లాడుతూ ఎఫ్‌పీవోలు పూర్తిగా ప్రభుత్వ రాయితీపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదగాలన్నారు. ఏపీ మాస్ సీఈవో సీఎస్ రెడ్డి మాట్లాడుతూ రైతుల బాగు కోసం పనిచేస్తున్న ఎఫ్‌పీవోలను ప్రభుత్వం ప్రోత్సహించాలని, ఎఫ్‌పీవోలను వ్యాపార సంస్థలుగా చేసేందుకు ఏపీ మాస్ కృషి చేస్తోందన్నారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ మదనపల్లె డివిజన్‌లో ఎఫ్‌పీవోలకు అన్ని విధాల సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెటింగ్ ఏడీఎం త్యాగరాజు, డీఏవో చంద్రానాయక్, ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు, 18 ఎఫ్‌పీవోల సభ్యులు పాల్గొన్నారు.

పట్టణంలో స్వచ్ఛతాహి కోసం 2కే రన్


2కే రన్ ప్రారంభించి మాట్లాడుతున్న డీపీవో ధనలక్ష్మి

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 18: పట్టణంలో 2కే రన్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి డీపీఓ ధనలక్ష్మి ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛతాహి భగీరథి కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన పెంచేందుకు మానవ హారాలు, పరుగుపందెం పోటీలు, ర్యాలీలు నిర్వహించాలన్నారు. సంపూర్ణ స్వచ్ఛతా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులు సామూహికంగా పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇందులో భాగంగా పట్టణంలో తారకరామ థియేటర్, బెంగళూరు బస్టాండు, చిత్తూరు బస్టాండు ప్రాంతాల్లో మురుగునీటి కాలువల్లో అయిల్‌బాల్స్ వేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు, స్ప్రే చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డీఎల్‌డీవో లక్ష్మీపతి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి: స్వచ్ఛతాహీ సేవ ద్వారా బుధవారం రెడ్డివారిపల్లి పంచాయతీ గొల్లపల్లిలో పారిశుధ్య పనులు చేపట్టినట్లు ఈవోపీఆర్డీ చలపతిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా మురుగునీటి కాలువలు సక్రమంగా లేక నీరు మొత్తం రోడ్లపై ప్రవహించేదన్నారు. దీనికి శాశ్వత పరిష్కారంగా కొత్తగా మురుగునీటి కాలువను ఏర్పాటు చేసి సీసీ రోడ్డు ఎత్తును పెంతామన్నారు. అనంతరం మురుగునీరు నిల్వవున్నచోట దోమలను నివారించేందుకు మందులను పిచికారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం అక్టోబరు 2వ తేది వరకు ప్రతి గ్రామ పంచాయతీలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మారెప్ప పాల్గొన్నారు.

పెద్దమండ్యం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతాహీ సేవా 2024 కార్యక్రమాలు విజయవంతం చేయాలని డీఎల్‌పీవో నాగరాజు పిలుపునిచ్చారు. పెద్దమండ్యం మండలంలో బుధవారం డీఎల్‌పీవో పర్యటించారు. ఇందులో భాగంగా జరుగుతున్న 5కే రన్‌లో పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమావేశంలో డీఎల్‌పీవో మాట్లాడుతూ అక్టోబరు 2వ తేది వరకు జరగనున్న స్వచ్ఛతాహీ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గురువారం గ్రామాల్లో ప్రతిజ్ఞ, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎంపీడీవో శ్రీధర్‌రావు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు జగన్, జనార్ధన, శైలజ, ఖాదర్‌బాషా, శేషాద్రి, హేమంత్‌రెడ్డి, సర్పంచులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై పరిష్కార వేదిక

రామసముద్రం, సెప్టెంబరు 18: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ నిర్మలాదేవి అధ్యక్షతన రెవెన్యూ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి పలు సమస్యలు పరిష్కరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు ఉన్న వారు ఎటువంటి గొడవలకు తావులేకుండా సరైన ఆధారాలతో వస్తే వారికి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుధాకర్‌రెడ్డి, ఆర్ఐ నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ చంద్రరాజు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రామసముద్రం, సెప్టెంబరు 18: రామసముద్రం-మదనపల్లె రోడ్డు మార్గంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. రామసముద్రం హరిజనవాడకు చెందిన సుదర్శన్ మదనపల్లె నుంచి రామసముద్రం వస్తుండగా కట్టుబావి వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సుదర్శన్ కాలుకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఇతన్ని 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

2కే రన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ గురుప్రసాద్

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 18: మదనపల్లె మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో నిర్వహించిన 2కే రన్ పోటీల్లో మదనపల్లె జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి చిప్పిలి పాలడెయిరీ వరకు నిర్వహించిన ఈ పరుగు పందెంలో వివిధ కళాశాలకు చెందిన విద్యార్థినులు పాల్గొన్నారు. ఇందులో జ్ఞానాంబిక విద్యార్థులు బి.కీర్తన ప్రథమ స్థానం, కె.గాయత్రి ద్వితీయస్థానం, సుస్మిత తృతీయ స్థానం గెలుపొందారు. వీరిని కరస్పాండెంట్ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, పీడీలు శరత్‌నాయక్, జగదీష్ అభినందించారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి


ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో, ఎంపీడీవో

తంబళ్లపల్లె, సెప్టెంబరు 18: ప్రభుత్వం నుంచి మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించేందుకు కృషి చేయాలని డీఎల్‌పీవో నాగరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో సురేంద్రనాథ్‌తో కలిసి డీఎల్‌పీవో మండల కేంద్రానికి సమీపంలోని ఇట్నేనివారిపల్లె లే అవుట్, మోడల్ స్కూల్ వెనుక ఉన్న లే అవుట్లను సందర్శించి ఇళ్ల నిర్మాణ ప్రగతిని తెలుసుకున్నారు. లే అవుట్లలో నెలకొన్న సమస్యలు, ఇళ్లు నిర్మించకపోవడానికి గల కారణాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించేందుకు కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్‌కుమార్, హౌసింగ్ ఏఈ సజాత, పీఆర్ ఏఈ హరినాథ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ద్విచక్ర వాహనం ఢీ- ఇరువురికి గాయాలు

పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 18: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలైన సంఘటన పీటీఎం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బూర్లపల్లె పంచాయతీ సొన్నువారిపల్లెకు చెందిన నరసింహులు, ఉత్తన్నలు స్వగ్రామం నుంచి స్వంత పనుల నిమిత్తం పీటీఎంకు వెళ్లి తిరిగి వస్తుండగా మండ్లవారిపల్లె క్రాస్‌లో ద్విచక్రవాహనాన్ని అటు వైపు తిప్పారు. ఈ క్రమంలో పీటీఎం నుంచి ములకలచెరువు మీదుగా తంబళ్లపల్లెకు వెళ్లే కారు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో ఉత్తన్న, నరసింహులు ఇరువురు గాయపడ్డారు. స్థానికులు ఎస్ఐ నరసింహుడుకు తెలియజేయడంతో సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని వెంటనే 108 వాహనం ద్వారా బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పిల్లలు పుట్టలేదని .. ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ములకలచెరువు, సెప్టెంబరు 18: పిల్లలు పుట్టలేదని ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన బుధవారం ములకలచెరువులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... ములకలచెరువులోని రాజీవ్‌కాలనీకి చెందిన కె.మహమ్మద్(35)కు బత్తలాపురంకు చెందిన హమీదాతో 13 ఏళ్ల కిందట వివాహమైంది. పిల్లలు పుట్టకపోవడంతో ఇద్దరూ తరచూ బాధపడేవారు. ఈ క్రమంలో హమీదా రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహమ్మద్ ఇంట్లో కిటికీకి చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటనా స్థలాన్ని ఎస్ఐ గాయత్రి పరిశీలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మిట్స్ విద్యార్థికి బంగారు పతకం


విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి

కురబలకోట, సెప్టెంబరు 18: మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థి ఆల్ ఇండియా థాల్ సైనిక్ క్యాంప్ పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో ఎన్‌సీసీ విభాగానికి చెందిన రేవంత్‌కుమార్ ఢిల్లీలో అఖిల భారత ఇండోర్ స్టేడియంలో ఈ నెల 2 నుంచి 13వ తేది వరకు జరిగిన మ్యాప్ రీడింగ్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలలో ఏపీ, తెలంగాణాకు చెందిన 91 క్యాడెట్స్ పాల్గొనగా కళాశాలకు చెందిన విద్యార్థి ఎన్‌సీసీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికయ్యాడు. కాగా ఎంపికైన విద్యార్థిని కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, కళాశాల ప్రిన్సిపల్ యువరాజ్ అభినందించారు.

లోకేశ్‌ను కలిసిన మదనపల్లె టీడీపీ నాయకులు


మంత్రి లోకేశ్‌ను కలిసిన టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 18: రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌ను మదనపల్లె టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఉండవల్లిలో లోకేశ్ నివాసంలో మదనపల్లె టీడీపీ మండల అధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొండ్రెడ్డి, క్లస్టర్ ఇన్చార్జి మేకల రెడ్డిశేఖర్ మంత్రిని కలిసారు. ఈ సందర్భంగా యువగళం పాదయాత్ర సందర్భంగా మదనపల్లె మండలం సీటీఎం గ్రామం వద్ద లోకేశ్ 500 కిలోమీటర్ల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు.

ఎన్డీఏ శాసన సభాపక్ష సమావేశానికి నల్లారి

కలికిరి, సెప్టెంబరు 18: కూటమి ప్రభుత్వం ఏర్పాటై వందరోజులు పూర్తయిన సందర్భంగా బుధవారం జరిగిన ఎన్డీఏ శాసన సభాపక్ష సమావేశానికి పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు నాయుడు నల్లారిని ఆప్యాయంగా పలకరించారు. ఆయన కూడా సీఎంకు అభివాదం చేశారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

కలికిరి, సెప్టెంబరు 18: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల స్థాయి క్రీడా పోటీలను మండల ప్రజా పరిషత్తు ఉపాధ్యక్షురాలు ఆర్.గాయత్రి ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొదటి రోజు గెలుపొందిన విద్యార్థినులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో కరీముల్లా, కలికిరి సర్పంచ్ యల్లయ్య, రెడ్డివారి యోగేష్‌రెడ్డి, హెచ్‌ఎంలు శారద, జయమ్మ, వ్యాయామ ఉపాధ్యాయులు రెడ్డిమోహన్‌రెడ్డి, ఆర్ముగం, రఘు, గీత, వెంకటరమణారెడ్డి సీఆర్పీలు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం చేయూత


మంత్రి లోకేశ్‌కు చెక్కును అందజేస్తున్న ప్రిన్సిపాల్

కురబలకోట, సెప్టెంబరు 18: విజయవాడలో సంభవించిన వరద బాధితుల సహాయార్థం జీవీఐసీ యాజమాన్యం చేయూతనందించారు. కళాశాల కరస్పాండెంట్ ఎన్.వి.రమణారెడ్డి ఆధ్వర్యంలో 3 ఇంజనీరింగ్ కళాశాల నుంచి విరాళాలు సేకరించి రూ.11 లక్షల విరాళాలను సేకరించారు. కాగా ఈ విరాళాన్ని విజయవాడలో మంత్రి లోకేశ్‌ను కలిసి సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తుల సమయాల్లో ప్రతి ఒక్కరూ చేయూతనందించి ఆదుకోవాలన్నారు. అలాగే ఇంజనీరింగ్ కళాశాల నుంచి రూ.6కోట్ల విరాళాలను ఇప్పటి దాకా అందజేశామన్నారు.

గణేశ్ నిమజ్జనంలో ట్రాక్టర్ నడిపిన ఎమ్మెల్యే


ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 18: పట్టణంలో నిర్వహించిన గణేష్ నిమజ్జనంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వినాయకుడి విగ్రహాన్ని తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ను నడిపి యువతను ఉత్సాహపరిచారు. మంగళవారం రాత్రి స్థానిక దిగువ కురవంకలో యువత ఘనంగా గణేష్ నిమజ్జనం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ లడ్డూను మార్పూరి వరుణ్, పగడాల యశ్వంత్ కలసి రూ.1.70 లక్షలకు వేలంలో పాడుకున్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ట్రాక్టర్‌ను కి.మీ. దూరం నడిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మల్లికార్జున, బిందేష్, జాని, నరేంద్ర, ఈశ్వర్, నాని పాల్గొన్నారు.

మహమ్మద్ మానవ మహోపకారి: ఎమ్మెల్యే

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 18: మహాప్రవక్త మహమ్మద్ మానవ మహోపకారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు బెంగళూరు బస్టాండ్‌లోని బడే మకాన్ హజరత్ ఖాదర్‌షా జౌలియా దర్గాలో ధార్మిక సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త అందరికీ ఆదర్శప్రాయుడన్నారు. కార్యక్రమంలో దర్గా ముతవల్లి మకాన్‌దార్ సయ్యద్ హాషిం, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబాన్ని ఆదుకోవడమే ధ్యేయం

వాల్మీకిపురం, సెప్టెంబరు 18: పీలేరు నియోజకవర్గం వ్యాప్తంగా ప్రతి నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవడమే ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ధ్యేయమని వాల్మీకిపురం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు, కార్యకర్తలు వినతి పత్రాలు అందజేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ సర్పంచ్ రాజేంద్రాచారి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, నాయకులు పీవీ నారాయణ, చంద్రమౌళి, కోసూరి రమేష్, మురళి, కువైత్ సయ్యద్‌బాషా, సుధాకర్‌రెడ్డి, బొక్కసం బ్రదర్స్ సైదు, జంషీద్, టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

కురబలకోట, సెప్టెంబరు 18: ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా చేపట్టాలని ఎంపీడీవో హరినారాయణ, ఈఈ వెంకటదాస్‌లు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ముదివేడు క్రాస్, మట్లివారిపల్లె లే అవుట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంపూర్తి నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి. కాలనీలలో ఏవైనా సమస్యలుంటే మా దృష్టికి తీసుకురావాలని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. అలాగే లబ్ధిదారులకు కావాల్సిన మెటీరియల్‌ను తక్కువ ధరకే అందిస్తామని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే నిర్మాణాలను కోసం అదనంగా రూ.35వేలు గ్రూపుల ద్వారా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డిఈ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంటకోత ప్రయోగాలపై శిక్షణ

నిమ్మనపల్లి, సెప్టెంబరు 18: మండలంలోని వ్యవసాయ రైతుల కొరకు 2004కు సంబంధించి ఖరీఫ్ సీజన్‌లో వారు పండించిన పంటలకు పంటకోత ప్రయోగంపై వ్యవసాయ, అనుబంధ శాఖల రైతుసేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు ఏవో మురళిమోహన్ తెలిపారు. బుధవారం ఏఎస్‌వో జగన్నాధంతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన సర్వే నెంబర్లలోని పంట పొలాల్లో సాగు చేసిన పంటల వివరాలు, వాటి దిగుబడులు సకాలంలో వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో లక్ష్మిప్రసన్న, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్ జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక


అండర్-17 జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన బాలికలు

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 18: ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ జట్లను మదనపల్లెలో ఎంపిక చేశారు. బుధవారం మండలంలోని ప్రైవేటు హైస్కూల్లో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంత ఆధ్వర్యంలో అండర్-17 బాల, బాలికల ఫుట్‌బాల్ జట్లను ఎంపిక చేశారు.

బాలుర జట్టు వివరాలు: విష్ణువర్దన్, దీక్షిత్‌రెడ్డి, ఈశ్వరప్రసాద్, జవహర్‌రెడ్డి, చరణ్ ప్రభు, హరీష్, మనోజ్, వంశీకళ్యాణ్, వరుణ్‌సాయి, దిలీప్‌కుమార్, ప్రణయ్, సుదీప్, యశ్వంత్, త్రివేష్, ఆనంద్, నరేష్, శ్రీధర్, స్టాండ్‌బైలుగా రిమాన్, సాహిల్, అఖిల్‌రెడ్డి, రోహిత్, ఫైజాన్ ఎంపికయ్యారు.

బాలికల జట్టు వివరాలు: వైష్ణవి, స్ఫూర్తి, ఇషిత, పల్లవి, మోక్షిత, ఆటిఫా సుల్తానా, చరణ్య, విష్ణుప్రియ, కీర్తన, రక్షిత, మాధురి, కీర్తి, లోహిత, అమృత, మౌనిక, హర్షవర్ధిని, లలిత, స్టాండ్‌బైలుగా నీరజగోస్వామి, హేమశ్రీ తన్మయి, మహాలక్ష్మీ ఎంపికయ్యారు. వీరిని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ నాయకులు అభినందించారు.

అనాథగా మారిన చిన్నారి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 18: మదనపల్లెలో హృదయ విదారక సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే... స్థానిక ఈశ్వరమ్మకాలనీలో నివాసం ఉండే దిల్‌నవాజ్ భార్య జుబేదా(30) కొంతకాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతోంది. ఈ మధ్యే కాలును కూడా తొలగించారు. ఆమె భర్త దుబాయ్‌లో పనిచేస్తూ పంపిన డబ్బులతో కుమార్తె అయేషా సిద్ధిక (8)ను పోషిస్తోంది. ఈ నేపథ్యంలో షుగర్ వ్యాధి ఎక్కువై మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఆమె మృతి చెందడంతో చిన్నారి ఒంటరైంది. బంధువులు ఎవరూ వెంట లేకపోవడం.. ఏం చేయాలో దిక్కుతోచక బోరున విలపిస్తుండడంతో చూసిన ప్రతిఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యారు. కాగా చిన్నారి తండ్రి దుబాయ్ నుంచి రానున్నట్లు తెలిసింది.

ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం చేయొద్దు

వాల్మీకిపురం, సెప్టెంబరు 18: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయరాదని వాల్మీకిపురం ఎంపీడీవో మనోహర్‌రాజు సూచించారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్యం, తాగునీటి సమస్యలు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలని, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి అభివృద్ధి, సమస్యల పరిష్కారం పనులు పూర్తి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ డాక్టర్ వెంకటరమణ, జడ్పీటీసీ నిర్మల, తహసీల్దార్ పామిలేటి, ఎంఈవోలు వెంకటరత్నం, వెంకటలక్ష్మి, ఈవో ఉదయ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.